నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

## నాగన్న పదాలు

సృష్టిలో తీయనిది
వెలకట్ట లేనిదీ
స్నేహమేర గొప్పది
ఓరి! నాగన్న.

కాకతీయ వైభవం
రామప్ప ఆలయం
తెలగాణ మణిమాల
ఓరి! నాగన్న.

ప్రేమ ప్రేమను పంచు
డబ్బు జబ్బును పెంచు
కసి బంధమును తెంచు
ఓరి! నాగన్న.

నీడ నిచ్చును తరువు
పంట నిచ్చును చెరువు
ధరణి! మోయు మేరువు
ఓరి! నాగన్న



– నెమలికొండ నాగేశ్వర్ రావు, 8688553470

నేటినిజం

# సాహితీ కెరటాలు

website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 23-2-2023

## ఘంటారావం

జనాభా లెక్కల్లో
ఒక్కరుగా ఉంటే ఎలా?
చుక్కల్లో చంద్రుడిలా
చమక్కుమనాలి కదా.

వరిస్తే అవకాశం
వరమవుతుంది
వారిస్తే
వైరి అవుతుంది.

ఆరునూరైనా
చిరునవ్వును వీడకు
మిన్నూమన్నూ ఏకమైనా
మానవత్వం మరువకు

అవనిలో ఏకైక
అవధాని తెలుగు
మహిలోని భాషలలో
మహారాణి తెలుగు.



–గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964



## డా॥ఎన్.గోపి గారి సాహిత్యంపై విమర్శ, సమీక్షా వ్యాసాల సంకలనం...

# "నిరంతర"







గోపి..అన్ స్టావబుల్ కవి..(Un stopable Poet). ఆయన సృష్టి 'నానీ'లు దేశ సరిహద్దులు కూడా దాటి వెళ్ళాయి. వేలాది శిష్యగణంతో 'జగమంత' కుటుంబం ఆయనది.

'గోపి' గారి గురించి కొత్తగా పరిచయం అక్కర్లేదు. భారతీయ సాహిత్యంలోని అత్యున్నత పురస్కారం 'జ్ఞానపీఠ్' కోసం ఆయన క్యూలో వున్నారు .కవి, ద్రష్ట. విమర్శ కుడు ఉత్తమ అధ్యాపకుడు, ఆచార్యుడు, వైస్ ఛాన్సలర్ ఇలా ఓ సాహితీ వేత్తగా. ఆయన విస్తృతిగురించి ఎంతైనా చెప్పొచ్చు.

పాతికకు పైగా పుస్తకాలు వచ్చాయి.'జల గీతం' ఆయనను జాతీయ కవిని చేసింది.

దేశభాషల్లో జలగీతం అనువాదమై జెండా ఎగరేసింది..ఆయన సృష్టి 'నానీ' లు దేశ సరిహద్దులు కూడా దాటి వెళ్ళాయి.వేలాది శిష్యగణంతో కూడిన 'జగమంత' కుటుం బం ఆయనది!!.

మంచితనం గోపి గారి. సొంతం., 'బంగారు' అంటూ చిన్నా,పెద్దా తేడా లేకుండా ప్రేమగా పలకరించడం ఆయన నిజ వ్యక్తిత్వం.వెరసి డాక్టర్ గోపి..అన్ స్టాపబుల్ కవి...(Un stopa ble Poet).

గోపి గారి సమగ్ర సాహిత్యంపై లబ్దప్రతిష్టు లైన విమర్శ కుల నుంచి,...ఇప్పుడిప్పుడే విమర్శ పాఠాలు చదువుకుంటున్న వారు రాసిన 90 వ్యాసాల సంకలనమే ఈ కొత్త

పుస్తకం "నిరంతర"... (ఇందులో గోపి గారి కరోనా కవితపై నేను రాసిన వ్యాసం కూడా వుంది)

ఈ నిరంతర యజ్ఞంతో పాటు, సంపాదకుడి పాత్రను కూడా డాక్టర్ రఘు గారు విజయ

వంతంగా నిర్వహించారు. కిల్లాడ సత్యనారాయణ, వంగాలి హర్షవర్ధన్, ఆచార్య సూర్యా ధనుంజయ్, డా.జి. అమృతలతగారు డా.జె.నీరజ సంపాదక మండలిలో వున్నారు.

ఈ బృహత్ సంకలనంలోని వ్యాసాలను కంటెంట్‌ను బట్టి అంశాలవారీగా విభజించి ప్రత్యేక అధ్యాయాలుగా వేరుచేయడం. బాగుంది. జలగీతం, హృదయరశ్మి, మళ్ళీ విత్తనంలోకి, పురి విప్పిన ఊపిరి, ఆకాశంలో మట్టి, జీవన భాష, ఎవరి దుఃఖమో ఇది,....

యాత్రాచరిత్రలు, చైనా పద్యాలు, వృద్ధోపని షత్, ప్రపంచీ కరోనా, మన వేమన, నానీలు, ఓకవి స్వీయ కథ. వ్యాస కలశం, ఇతర భాషల్లోకి గోపి రచనలు, మనిషిని కలిసినట్టుండాలి. అవీ, ఇవీ! ఇలా ఒక్కో అధ్యాయందేనికదే.. ప్రత్యేకం..!!

నీటి సాహిత్యంలో మేటి బుగ్గ 'జల గీతం' అనే ఆచార్య రాచపాళెం చంద్రశేఖ ర్ రెడ్డి గారి విమర్శనా వ్యాసం ఈ సంకలనంలో మొదటిది. మూడొంతులు నీళ్ళు,ఒక వంతు భూమితో కూడిన ప్రకృతి ని. 'భూగోళం' అనడం సరికాదని, దాన్ని 'జలగోళం' అనాలనిగోపి గారు చేసిన సరికొత్త 'ప్రతిపాదనకు' రాచపాళెం గారు ఓటేశారు.

ఆత్మ ప్రక్షాళన చేసే బోధగురువు నీరు.. అన్న కవి వాక్యానికి ఆయన ప్రశంస లభించింది.!

"కవిత్వమై కురిసిన హృదయరశ్మి" అంటూ గోపిగారి కవిత్వాన్ని కొండ్రెడ్డి వేంకటేశ్వర రెడ్డి సమీక్షించిన వ్యాసం విశ్లేషణాత్మకంగా వుంది.

కవితారశ్మిని అక్షరాల్లో వ్యక్తీకరించిన కవి గోపి ని ఆయన ఆకాశానికి ఎత్తేశారు.!

డా॥వెల్లండి శ్రీధర్ వ్యాసం..కాలానికి కాయ కల్ప చికిత్స,'హృదయరశ్మి' బాగుంది. గోపిగారి అక్షరాల్లో మానవ తృపు పుప్పొడి, నిప్పు కణికల వేడి జమిలిగా కలిసుంటాయని.. ఆయన ప్రశంసించారు.

రాజారామ్ తూముచర్ల రాసిన
**"కాగితంపై మట్టిని చల్లి ..**
**ఆమట్టిని కవిత్వం చేసే మార్మి**
**కవి అతడే"** అన్న వ్యాసం బాగుంది.
**""అతడు గతాన్ని**
**వర్తమానాన్ని**
**కలిపి కుడుతున్నాడు".**అతడే గోపి గారనడం సమంజసంగా అనిపించింది..

**"ఆకాశంలో మట్టి అనే కవితలో " కొంచెం మట్టిని తెచ్చి .. కాగితంపై చల్లాను.అవే**
**ఈ అక్షరాలు"**అనే వాక్యం ద్వారా మనిషి కూడా మట్టిలో భాగమని చెప్పకనే చెప్పారు గోపీగారు అనడం రాజారాం పరిశీలనా దృష్టి కి మెచ్చుతునక.

ఆకాశమంత ఎదిగిన కవి డా.ఎన్.గోపి అన్న 'ఆచార్య ఎస్వీ సత్యనారాయణ'గారి వ్యాసం గోపిగారి సాహిత్యానికి అద్దం పట్టింది.!

**"భాష తరతరాల మానవీయ**
**సంవేదన నుండి పుట్టిన అల్లిక"**
**"భాష వొట్టి వాహిక కాదు.ఊపిరితో పేనిన**
**భావన"!**
**"కవిత్వానికి కాలం కూడా ఒక లక్షణం"!**
**"కవిత్వం ఒక ఆకురాయి. సానబెడితేనే**
**తళుకు కవిత్వం..ఒక విస్ఫురాయి.నలిగి**
**తేనే మెరుపు"** లాంటి వాక్యాలను ఉటంకించి గోపిగారి కవిత్వన్ని నిలువుటద్దంలో చూపించారు ఎస్వీ సత్యనారాయణ..!!

గోపిగారు కవిత్వం తన జీవన భాషగా నిర్వచించారని పేర్కొంటూ సీతారాం రాసి న వ్యాసం ఆలోచింపజేస్తుంది.. గోపిగారి జీవన భాష కవిత్వాన్ని సీతారాం గారుస్కాన్ చేసిన విధానాన్ని చెప్పడం కంటే పాఠకులు చదివితేనే బాగుంటుంది..!

**''వస్తు వలయంలో కవిత్వ కాంతి పుంజం"**
అన్న 'విహారి' గారి వ్యాసం బాగుంది.గోపి గారు తన 22వ కవితా సంపుటి ద్వారా .. అచ్చమైన మానవీయ భావ సంపదని గోపిగారు పాఠకులకు పంచిన తీరును ఆయన పరిచయం చేశారు..!

**"నిశిత విమర్శకుడు డా.ఎన్.గోపి** అంటూ డాక్టర్ రఘు గారు రాసిన వ్యాసం గోపి గారి లోని విమర్శకుడ్ని పట్టిస్తుంది.గోపి గారు?

**"వేమన పద్యాలు..ప్యారిస్ ప్రతి"** లోని రాత ప్రతి పద్యాలను పరిష్కరించిన వైనాన్ని రఘు ప్రస్తావించడం బాగుంది.."గవాక్షం"అనే వ్యాస సంపుటి గోపి గారిని ఆధునిక కవిత్వ విమర్శ కుడిగా నిలబెట్టిన తీరును రఘుగారి మాట ల్లోనే చదవాలి.

తెలుగు సరే.! దేశంలోని విభిన్న భాషల్లో గోపి కవితా ప్రతిభ గురించి గుడిపాటి రాసిన వ్యాసం విలువైంది..గోపి గారిని జాతీయ కవి గా నిలబెట్టిన వ్యాసం ఇది. పలు భాషల్లోకి జలగీతం, నానీలు అనువాదమైన తీరును గుడిపాటి చక్కగా వివరించారు.

నేను( ఎ.రజాహుస్సేన్ ) రాసిన **"కరోనా పాఠాలు"** వ్యాసంలో కరోనాకాలంలో విరాజిల్లిన వైరాగ్య శోభకు గోపిగారి కవిత్వం ఎలా అద్దం పట్టిందో వివరించాను.

**"కవి ఇంట్లోనే వున్నాడు గానీ,**
**బయట కూడా వుంటాడు**
**ఇవాళ అతడు ఎగరేసేవి**
**భావ మేఘాలు కాదు**
**కారుణ్య రాగాలు"..!**
అనడం గోపీగారికే చెల్లింది.

కరోనా కవిత్వంలో 'వేగం ' కాదు.' ఉద్వేగం' ముఖ్యమన్న గోపిగారి మాటలు అక్షర సత్యం.!

**'గుండె బరువును దించే కవితా శరణ్యం'** అంటూ,.. కవిమెట్టా నాగేశ్వరరావు రాసిన ఓ వ్యాసం ఇందులో వుంది. గోపి గారి కవి త్వం కవిత్వంగా వుంటుంద నడం లోమెట్టా చెప్పదలిచిన అర్థం ఏమిటో తెలీలేదు.

**"మనో నిబ్బరాన్ని నింపే ప్రపంచీ కరోనా కవిత్వమంటూ.**'పుట్టి గిరిధర్' రాసిన వ్యాసం కరోనా పరిస్థితుల్ని స్కాన్ చేసింది.!

తంగిరాల చక్రవర్తి గారు గోపి **"పురివిప్పిన ఊపిరి"** కవితా సంపుటిని సమీక్షించిన తీరు మెచ్చదగింది. విభిన్నత, గొప్ప అర్థ శబ్ద, వస్తు శిల్ప,.. భావస్ఫోరకత..గోపీ గారి కవిత్వంలో కనిపిస్తాయని చెప్పడం నూరు శాతం నిజం!

గోపి జర్మనీ యాత్ర కథనం కవితాత్మకంగా వుందని డా.ముదిగంటి సుజాతా రెడ్డి చెప్పడం సముచితంగా అనిపిస్తుంది.గోపిగారి జర్మనీ యాత్ర. ప్రారంభం..ఆయన జర్మనీలో రాసిన"కొత్త మేఘాలు" తో మొదలైందనడం బాగుంది.

ఎం.నారాయణ శర్మ గారు..గోపి "ఎవరి దుఃఖమో అది'' అనే కవితా సంపుటిని సవివరంగా సమీక్షించారు..శబ్దాలకు అలిసి పోయిన చెవులకు నిశ్శబ్దం రుచి తెలియాలి".అన్న గోపిగారి వాక్యం ఈ కవిత్వానికి కేంద్రబిందువు. ప్రపంచంలోని దుఃఖాన్ని అనుభవించి గోపి గారు ఈ కవిత్వం రాశారనడం ఎంతైనా నిజం.!!

"అభినవ ఉపనిషత్ చేర్పు–గోపి కవిత్వ కూర్పు" అంటూ డా.నలిమెల భాస్కర్ గారి వ్యాసం ఎంతో విలువైంది. గోపిగారి "వృద్ధోపనిషత్" ను నలిమెల విశ్లేషించిన తీరు విజ్ఞాన దాయకంగా అనిపించింది."ముదిమిని అంగీకరించడం.. మాట్లాడి నంత సులువు కాదు..అన్న గోపిగారి మాట..నిజాల మూట..!!

పోలంకి సత్యనారాయణ గారి..**"సులువైన వాక్యాల్లో బరువైన భావాలు"** అనే వ్యాసం గోపిగారి వాక్యప్రయోగాల్ని పట్టి ఇచ్చాయి.

**"గోపి..ఒక చలనం..! ఒక జ్వలనం!**అన్న శ్రీ వేదా శ్రీనివాస్ వ్యాసం చదవదగ్గది..!

**గోపి తన బాధ ప్రపంచానికి పులమడు..**
**ఈ సకల జగతి తానే అన్నట్టుగా భావిస్తా**
**డన్న** వేదా శ్రీనివాస్ వ్యాఖ్యలో నిజముంది. రామా చంద్రమౌళి వ్యాసం..**'వృద్ధి చెందిన వాడే వృద్ధుడు'** అన్న రామా చంద్రమౌళి

వ్యాసం గోపిగారి దృష్టిలో వృద్ధాప్యాన్ని పట్టిస్తుంది."వృద్ధాప్యం ఒక జీవన సారాంశం''అన్న గోపి గారి మాటల్ని ఈ వ్యాసకర్త విశ్లేషణలో చదవాలి..!

**'దాట్ల దేవదానం రాజు..ఎవరి దుఃఖముతో అది'** అనేకవితా సంపుటిని సమీక్షించారు. నీరజగారు రాసిన..'ఇంగ్లండు గుండెల్లో కవితాత్మక యాత్ర' అనే పదప్రయోగం బాగుందో లేదో పాఠకులే నిర్ణయించుకోవాలి.

ఈ సంకలనంలో కొన్ని చిక్కని, చక్కని వ్యాసాలున్నా, చాలావరకు గోపిగారిని ఎలివేటర్ చేస్తూ.. రాసినవే ఎక్కువ. గోపిగారి మీద కంటే ఆయన సాహిత్యంపై దృష్టి పెట్టి వుంటే ఈ 'నిరంతర' మరింత గొప్పగా వుండేది.

అన్నట్టు ఈ "నిరంతర"కు సీక్వెల్, అంటే రెండో భాగం కూడా వుందని డాక్టర్ రఘు గారు ప్రకటించారు.

మొత్తం 544పేజీల పుస్తకం చివర్లో గోపి గారి ఫోటోలను, ఆయన రచనా సర్వస్వాన్ని అనుబంధంగా జతచేయడం బాగుంది.. ఈ నిరంత ర వెనుక డాక్టర్ రఘు 'నిరంతర' కృషి అభినందనీయం.

గోపిగారి 70వ జన్మదిన సందర్భంగా ఈ పుస్తకం రావలసి వున్నా, కరోనా కారణంగా ఓ రెండేళ్ళు ఆలస్యమ య్యాయి..!

ఈ "నిరంతర"సంకలనం గోపి గారి సాహిత్య జీవితాన్ని పట్టిస్తుందనడంలో ఎటువంటి.. సందేహం లేదు..!!

**ప్రతులకు..**ఎన్ అరుణ,
13.1 /5 బి. శ్రీనివాసపురం
రామాంతపూర్,
హైదరాబాద్–500013
ఈ పుస్తకం వెల..రూ.500 /
ఫోన్040.27037585
సెల్:9391028496..



–ఎ.రజాహుస్సేన్
9063167117





## కవయిత్రి యశోదారెడ్డికి నివాళి



యశోదారెడ్డికి నివాళులర్పిస్తున్న దయానంద్, జనార్ధనమూర్తి, రమణ వెలమకన్ని తదితరులు.

కవయిత్రి యశోదారెడ్డి జయంతిని గానసభలో సోమవారం నిర్వహించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ మాట్లాడుతూ.. సాహితీ ప్రక్రియల్లో తెలంగాణ మాండలిక పదాలను ప్రయోగాత్మకంగా ఉపయోగించే సాహితీవేత్త యశోదారెడ్డి అని పేర్కొన్నారు. రమణ వెలమకన్ని, వైఎస్ఆర్. మూర్తి, కొల్లి నాగేశ్వరరావు, చక్రపాణి నివాళులు అర్పించారు.

## 'కైరవి' తెలుగు గజళ్ల సంపుటి ఆవిష్కరణ



గ్రంథావిష్కరణలో సూరారం శంకర్, డా॥బి.డి. రాజగోపాల రెడ్డి, బిక్కి కృష్ణ, రాజావాసిరెడ్డి మల్లీశ్వరి, రాధాకుసుమ.

రాజా వాసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలుగు గజల్ రచయిత్రి రాజావాసిరెడ్డి మల్లీశ్వరి రచించిన 'కైరవి' తెలుగు గజళ్ల సంపుటి ఆవిష్కరణ సభ శనివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. కవి, కథా రచయిత డా॥ బి.డి. రాజగోపాల్ మాట్లాడుతూ అదమైన పుష్పగుచ్ఛం లాంటి గజళ్ల సంపుటి అని కొనియాడారు. విమర్శకుడు డా॥ బిక్కి కృష్ణ మాట్లాడుతూ మల్లీశ్వరి రచించిన గజళ్ళు తెలుగు సాహిత్య చరిత్రలో నూత,న ఒరవడిని సృష్టించాయన్నారు. గజల్ ఎంత గొప్పగా రాసినా.. సంగీత ప్రియుల హృదయాల్లో చొచ్చుకొని పోవాలంటే గాయనీ గాయకుల వల్లే సాధ్యమన్నారు. అంతకుముందు మల్లీశ్వరి, రచనలను 'తెలుగు గజల్ గానం' శీర్షికన గాయకుడు లక్ష్మీభవాని, రుక్మిణి, జయశ్రీ, గంగూలి, శాంతి నిర్మల, ఆనంద్ తలారి గానం చేసి ప్రేక్షకులను సమ్మోహితుల్ని చేశారు. గజల్ కవి సూరారం శంకర్, అభినందనలు తెలిపారు. రాధా కుసుమ సమన్వయకర్తగా వ్యవహరించారు.







ఆకలి డొక్కకి
ముద్ద కరువు
విలాసాల విస్తరికి
దుబారా దరువు



నేటి ప్రపంచం
ఒక కుగ్రామం
మా పల్లె మాత్రం
విశాల ప్రపంచం



తాత అంచనా
తలకిందులు..
చవుడు నేల
ప్లాట్లు పండిస్తోంది



ఒంటరి ప్రయాణం
ఎలా అవుతుంది..?
జోడెద్దులూ
గణగణ గంటలూ



మర్రిచెట్టు ఊడలే
మాకు స్ఫూర్తి
ఊరు ఇప్పటికీ
ఉమ్మడి కుటుంబమే.



కన్నుల పండువగా
వేడుక
కొన్ని కళ్ళలో మాత్రం
కన్నీటి కాటుక





చెత్త నుంచీ
సంపద సృష్టి
బుల్లి తెర కూడా
పనికొస్తుందేమో



–సోమేపల్లి వెంకటసుబ్బయ్య
9000004565

## దేశ ప్రజలను ప్రేమించడమే నిజమైన దేశభక్తి

### మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యానాయుడు



'రేవు తిరగబడితే' నవలను ఆవిష్కరించిన యం. వెంకయ్యానాయుడు. చిత్రంలో కె. శ్రీనివాస్, ఆచార్య బీజే రావు తదితరులు.

దేశ ప్రజల పట్ల ప్రేమ, వారి అభ్యున్నతి పట్ల చిత్తశుద్ధితో వ్యవహరిం చడమే నిజమైన దేశభక్తిగా తాను విశ్వసిస్తున్నట్లు మాజీ ఉపరాష్ట్రపతి యం వెంకయ్య నాయుడు తెలిపారు. ద్రవిడ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు పులికొండ సుబ్బాచారి రాసిన 'రేవు తిరగబడితే' నవలను తెలుగుల వైభవం' పద్య కావ్యాన్ని సోమావారం హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని జాకీర్ హుస్సేన్ హాల్లో వెంకయ్యానాయుడు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వరాజ్యం సాధించిన తొలినాళ్లలో ఇంకా స్వాతంత్ర్యం సిద్దించని ప్రజల స్థితిగతులను ఈ నవల కళ్లకు కడుతుందన్నారు.

తెలుగు వారంతా ఇంట బయట తెలుగులోనే సంభాషణలు కొనసాగించాలంటూ పిలుపునిచ్చారు. ఆంధ్రజ్యోతి ఎడటర్ కె. శ్రీనివాస్, హెచ్‌సీయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య ఆర్ఎస్ స్వరాజు, ఆచార్యులు కోయి కోటేశ్వరరావు, హెచ్‌సీయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య బీజే రావు, ప్రముఖ కవి కొప్పర్తి వెంకట రమణమూర్తి, ఆచార్య వెంకటేశ్వరరావు, ఆచార్య విష్ణుసర్వదే, రచయిత ఆచార్య పులికొండ సుబ్బాచారి తదితరులు పాల్గొన్నారు.

## ఘంటసాల జీవిత చరిత్ర రాయడం గొప్ప కళ

### –అధికార భాషా సంఘం చైర్మన్ మంత్రి శ్రీదేవి



పీఎస్ గోపాలకృష్ణ రచించిన 'మన ఘంటసాల' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీదేవి, రామలింగేశ్వరరావు, వంశీరామరాజు తదితరులు.

సాహితీ వ్యాసంగం కళ ఐతే చరిత్ర రాయటం గొప్ప కళ అని అధికార భాషా సంఘం చైర్మన్ మంత్రి శ్రీదేవి అన్నారు. గోపాలకృష్ణ రచించిన ఘంటసాల చరిత్ర ఆయన విశేష కృషికి నిదర్శనమని అభినందించారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్ట్ నిర్వహణలో డాక్టర్ పిఎస్ గోపాలకృష్ణ రచించిన మన ఘంటసాల గ్రంథావిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా శ్రీదేవి పాల్గొని మాట్లాడుతూ నాడు ఘంటసాల పాటలు విని ఎంతో ఉత్తేజం పొందానని నేడు అట్టి పాటలు తక్కువగా వస్తున్నాయని అందుకే ఆయన పాటలు ఇప్పటికి వింటున్నారని పేర్కొన్నారు. గ్రంథావిష్కరణ వేసిన గీత రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు మాట్లాడుతూ పుస్తకాన్ని ప్రచురించిన చిట్టెన్ రాజు సాహితీప్రియుడు అన్నారు. ఆయన ఘంటసాల జీవిత చరిత్ర ప్రచురణకు సహకరించి తెలుగు వారికి మహోన్నత ఉపకారం చేసారని కొనియాడారు. గ్రంథ రచయిత గోపాలకృష్ణ మాట్లాడుతూ ఘంటసాలతో ఉన్న అనుబం ధం మాటలకు అతీతమన్నారు. గాయకుడు బాలు తన గ్రంథ రచనకు ప్రోత్సహించారని వివరించారు. అధ్యక్షత వహించిన వంశీ రామరాజు ఘంటసాల పాటతో విదేశాల్లో తమ అనాధ ఆశ్రమానికి నిధులు సేకరిస్తున్నానని తెలిపారు. సింగపూర్ తెలుగు సమాజం సత్యమూర్తి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు. మిత్ర, శారదా సాయి పాడిన పాటలు శ్రోతలను మైమరపింపచాయి.



# మాతృభాషలోనే రాసి అంతర్జాతీయ ఖ్యాతిని అందుకున్న కవి "సీతాకాంత్ మహాపాత్ర"

భారతీయ సాహిత్య మౌలిక ఆత్మ సామాన్య జన జీవితాల్లో వుంది. ఇక మనదేశ సాంస్కృతిక వారసత్వం, భారతీయత, భిన్నత్వంలో ఏకత్వం అన్న ప్రధానమయిన లక్షణాలతో వుంది. మన దేశంలో సాహిత్యమే భారతీయ సామాజిక సాంస్కృతిక బహుల త్వాన్ని ఒకటిగా ఉంచడంలో ఉత్ప్రేరకం గా పని చేసింది. మనషుల కళలు, ప్రేమ జీవితం, మరణా లను సంపూర్ణంగా ఆవిష్కరించి సంపూర్ణ మానవుణ్ణి ఆవిష్కరిం చింది.

అలాంటి మన దేశంలో ఓడిస్సాలో పుట్టి గొప్ప సాహిత్య సృజన చేసిన వాడు శ్రీ సీతాకాంత్ మహాపాత్ర.

ఒకసారి సుప్రసిద్ధ ఒరియా కవి సీతాకాంత్ మహాపాత్ర మరో ప్రముఖ కవి గుల్జార్ ని భువనేశ్వర్‌లోని తన ఇంటికి ఆహ్వానించాడు. అప్పుడు ఇంట్లోకి వెళ్ళగానే ఆశ్చర్య పోయిన గుల్జార్ అన్నాడు " మీరు ఇంట్లో ఉంటున్నారా లేక లైబ్రరీలోనా అన్నాడంట". అంటే ఒరియా లోనూ ఇంగ్లీష్ లోనూ విస్తృతంగా రాసిన సీతాకాంత్ మహాపాత్ర మనసులోనూ, జీవితం లోనూ ఇంట్లోనూ పుసకాలూ సాహిత్యమూ ఎంతగా పెనవేసుకుని పోయాయో మన కర్తమవుతుంది. ఆయన హృదయం నిండా మాట పాట భాష కవిత్వం, మొత్తంగా సాహిత్యమే నిండి పోయింది.

మన్మోహన్ సింగ్ ప్రధానిగా వున్నప్పుడు జాతీయ ఇంటిగ్రేషణ్ కౌన్సిల్ సభుడిగా గుల్జార్, విక్రం సేత్,కమలేశ్వర్ లతో పాటు సీతాకాంత్ మహాపాత్ర సభ్యుడిగా పనిచేసారు.

సెప్టెంబర్ 17, 1937 రోజున జన్మించిన సీతాకాంత మహాపాత్ర ఒరిస్సా ప్రజల జీవితాల్నీ, భాషా సంస్కృతుల్ని తన రచనలనిండా ఆవిష్కరించాడు. కేవలం ఒరిస్సా లోనే కాదు యావత్ భారతీయ భాషా సాహిత్యాలల్లో ఈరోజు పేరెన్నిక గన్న సాహిత్యకారుడు సీతాకాంత్. ఆయన కవిత్వంలో ఒరియా ప్రజలు అత్యంత సాధారణంగా, అమాయకంగా, ప్రేమగా సున్నితంగా కనిపిస్తారు.



సాహిత్య రచనలతో పాటు సీతాకాంత్ మహాపాత్ర చిన్న చిన్న సంప్రదాయాల్ని కూడా తన రచనల్లో పరిచయం చేసారు.

సీతాకాంత్ మహాపాత్ర ఒడిషా లోని మహానది యొక్క ఉపనది "చిత్రోత్పల" యొక్క ఒడ్డున గల మహంగ గ్రామంలో 1937 లో జన్మించారు. ఆయన సాంప్రదాయ కుటుంబంలో ఒరియా భాషలో గల భగవద్గీతలోని అధ్యాయాన్ని వల్లె వేస్తూ పెరిగాడు. ఆయన కొరువా ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించిన తదుపరి కటక్‌లోని "రేవెన్‌షా కాలేజి" (అప్పటికి ఉత్కల్ విశ్వవిద్యాలయ అనుబంధ కాలేజి) ని ఎంచుకున్నారు. అచట 1957 లో బి.ఎ హిస్టరీ ఆనర్స్ ను పూర్తి చేసారు. ఆ తరువాత 1959 లో అలహావాదు విశ్వవిద్యాలయం నుండి రాజనీతి శాస్త్రంలో ఎం.ఎ డిగ్రీని పూర్తిచేసారు. ఆ కాలంలో ఆయన విశ్వవిద్యాలయ జర్నల్ సంపాదకునిగా యున్నారు. అచట ఆయన ఆంగ్లము, ఒరియా భాషలలో రచనలను ప్రారంభించారు. కానీ తరువాత ఆయన తన స్థానిక భాషలోనే కవిత్వం వ్రాయాలని నిర్ణయించుకున్నాడు. " ఒక కవి తను కలలు కన్న భావాలను వ్యక్తీకరించడానికి స్వంత భాష అవసరం" అని ఆయన అభిప్రాయం. ఆయన పాండిత్య రచనలన్నీ ఆంగ్లంలో ఉన్నాయి. 1969 లో కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం నుండి ఆయన డిప్ ఓవర్సీస్ డెవలప్‌మెంటు అధ్యయనం" చేసారు. అదేవిధంగా 1988 లో హార్వర్డ్ విశ్వ విద్యాలయంలోని ఆహార ఫౌండేషన్ ఫెలోషిప్ కార్యక్రంలో భాగంగా ఒక సంవత్సరం పాటు గడిపాడు.

### అవార్డులు, గుర్తింపులు

ఒరిస్సా సాహిత్య అకాడమీ అవార్డు-1971, 1984, సాహిత్య అకాడమీ అవార్డు-1974, సరాలా అవార్డు - 1985, జ్ఞానపీఠ్ అవార్డు, భారతదేశపు అత్యున్నత సాహిత్య గౌరవం - 1993, పద్మ భూషణ్ (భారతదేశపు మూడవ అత్యున్నత పౌర పురస్కారం)-2003, పద్మ విభూషణ్ (భారతదేశపు రెండవ అత్యున్నత పౌర పుర స్కారం) - 2010, సాహిత్య అకాడమీ ఫెలో - 2013, సార్క్ సాహిత్య పురస్కారం-2015, ఠాగూర్ శాంతి అవార్డు-2017

ఆయన అలహాబాద్ విశ్వవిద్యాలయం లో రాజనీతిశాస్త్రంలో తన ఎం.ఏ. చదువుతున్నప్పుడే తాను తన కవిత్వాని కేవలం తన మాతృభాష ఒడియా లోనే రాస్తానని నిర్ణయించుకున్నాడు. అట్లా ఆయన తీసుకున్న కటిన నిర్ణయం ఇప్పటికీ పాటిస్తున్నారు. ఆయనకున్న భాషా పాండిత్యాన్ని బట్టి చూస్తే ఆయన ఇంగ్లీషులో కూడా బాగా రాయగలరు కానీ తాను తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి వుండిపోయారు. దాంతో ఆయన రచనలు అనేకం వివిధ భారతీయ, విదేశీ భాషల్లోకి అనువదించబడ్డాయి ఆయన పాఠకులు విస్తృతంగా పెరిగారు. సీతాకాంత్ మహాపాత్ర సాహిత్యం హిబ్రూ, జపనీస్, డేనిష్, లాంటి భాషల్లోకి కూడా వెళ్ళింది. ఆయన సృజనాత్మక రచనలతో పాటు అనేక స్వీయ యాత్రా చరిత్రలు కూడా రాసారు. ఎంత విస్తారంగా పర్యటనలు చేసినప్పటికీ తన హృదయం ఎప్పటికీ ఒడియా లోనే వుంటుంది అంటారాయన. ఎందుకు అంటే **"కవిత్వం ఆత్మనుంచి వస్తుంది, అందుకే దాన్ని మనం పుట్టి పెరిగిన భాషలోనే బాగా రాయగలం , అందుకే దాన్ని మనం మాతృభాష అంటాం. అందుకే నాకు ఒడియా తల్లి లాంటిది. నేను అందులోనే రాయడానికి ఇష్టపడతాను, ఎంతో సంతృప్తిగా రాయగలను.** అంటారు.

ఆయన మొదట తన చదువు అయి పోగానే ఉత్కల్ విశ్వవిద్యాలయం లో అధ్యాపకుడిగా కొంత కాలం పని చేసారు. తర్వాత సివిల్స్ పరీక్ష రాసి మొత్తంగా ప్రథమ స్థానంలో ఉత్తీర్నుడయి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లో అనేక పదవుల్ని నిర్వహించారు. ఆయన ఉన్నత అధికారిగా అనేక ఉన్నత పదవుల్ని నిర్వహించారు. కేంద్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శిగా, హార్వర్డ్ విశ్వవిద్యాలయం సీనియర్ ఫెల్లో గా, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం అంతర్జాతీయ అకాడెమీ ఆఫ్ పోయెట్స్ హానరారీ ఫెల్లో గానూ, నేషనల్ బుక్ ట్రస్ట్ చైర్మన్ గానూ యునెస్కో లోనూ పనిచేసారు. 'ఇన్నేళ్ళూ సివిల్ సర్వీసేస్ నా వృత్తే అయినప్పటికీ కవిత్వ మే నా భావోద్వేగం అంటాడాయన.

పుస్తకాలంటే అమిత ప్రేమను చూపించే ఆయన ఒక మంచి పుస్తకం కొన్నప్పుడు పొందే ఆనందం మరే వస్తువు కొన్నా రాదు అంటాడు. పుస్తకాలను చేతిలో పట్టుకున్నప్పుడు, వాటి వాసన, భావన ఆయన హృదయం లో ప్రత్యేకమయిన స్థానాన్ని పొందుతాయి. తాను టీవీ చూస్తానని అయితే పుస్తకాలు చదివినప్పుడు కలిగే సంతోషం టీవీ చూడడడం లో కలగదని అంటాడు.

ఇప్పటికే ఆయన 15 కవితా సంకలనాలు, 5 వ్యాస సంకలనాలు,30కి పైగా వివిధ ఆలోచనాత్మక రచనలుచేసారు. ఆయన కవితా సంకలనాలల్లో అష్టపది, సబ్దర్ ఆకాష్ (ద స్కై ఆఫ్ వర్డ్స్), అరా దుష్య, శ్రేష్ఠ కవిత, శబ్ద, ఓ నిర్వకత, అనేక శరత, ఉషావిలాస, సముద్ర, అనెక్ శరత్, లాంటివి ప్రముఖ మ యినవి. ఇక ఆయన రచ్నల్లు ఇంగ్లీషు లో The ruined temple and other poems భారతీయ గిరిజన మౌఖిక కవిత్వ అనువాదం Unending rhythms మొదలయినవి వెలు వడ్డాయి.

కవిత్వం తో పాటు సీతాకాంత్ మహాపాత్ర కృషి ముఖ్యంగా సంతాల్స్ పైన చేసారు. భారత దేశంలో అధిక సంఖ్యలో వున్నా ఆ గిరిజనా జన జీవాలపైన ఆయన కృషి ఎంతో విలువయింది. "నేను ప్రధానంగా నాకు వచ్చీ రాణి సంథాల్ భాషలో వారితో మాట్లాడుతాను, ఎలాంటి సిగ్గూ మొహమాటం, లేకుండా అంటారాయన. సంథాల్ గురించి అనేక రచనలు చేసారాయన. అంతే కాదు తనకు కొంత ఫ్రెంచి కూడా వచ్చుని అన్నారు. అయితే ఏ భాష అయినా ఉపయోగించుకుంటే మర్చిపోతామని అంటారాయన. 'కేవలం రచనలే నన్ను బతికిస్తున్నాయి' అంటారాయన.




సాహితీ సవంతి

-వారాల ఆనంద్
9440501281



**సీతాకాంత్ మహాపాత్ర ఒరియా కవిత:**

కాలం ఎగిరిపోదు
ఎగిరిపోయేది కాలం కాదు
మనుషులు సమస్త జీవ జాలమే
ఎగిరిపోతుంది
నల్లటి కోటు తొడుక్కున్న మేఘం
రూప చిత్రం లా కూర్చున్న కూర్చుని
నాన్నకు
వీడ్కోలు చెబుతూ
ఎగిరిపోతుంది
నాన్న తల ఇంటి ముందున్న
వరండా గోడను ఆసరాచేసు
కుంటుంది
మరుసటి రోజు
ఆయన వెనుతిరిగి
అస్తమిస్తున్న సూర్యునితో పాటు
ఎగిరిపోయి క్షితిజం లో
చేరిపోయాడు
రోదిస్తున్న వృక్షానికి వీడ్కోలు
చెబుతూ
ఆకులు రాలిపోతాయి
కట్టెలు కొట్టేవాడొచ్చి
చెట్టును నరికేస్తాడు
తాను పుట్టి పెరిగి నిలబడ్డ నేలకు
వీడ్కోలు చెబుతూ చెట్టు నేలకు
ఒరుగుతుంది
అకస్మాత్తుగా
ఇల్లూ, నదులూ,అడవులూ,
పొలాలూ, చిత్తడి నేలలూ
బంధువులూ
కాలం చిత్రించిన అనంతమ
యిన చిత్రాలూ
నిశీధిలోకి కదిలిపోవడం
చూస్తాం.
వర్షంలేని చిత్ర పుంజి
అమ్మాయిల గుంపులాగా
చిన్న పర్వతాలు సమూహం గా
కూర్చుని
పూచి ఆడుకుంటున్నాయి
పైన కమ్ముకుంటున్న మబ్బుల
తో
అవి మాట్లాడుతూనే వున్నాయి
అనేక విషయాలు మాట్లాడు
తూనే వున్నాయి.
గుర్తు తెలియని ఓ పర్వతం
విశాలమయిన భూమ్మిదికి
దుమికిన
సెలయేరును గుర్తు తెచ్చు
కుంది
అదిప్పుడు పూర్తిగా ఎండిపో
యింది.
చాలా దూరంగా మండు
తున్న ఎండిపోయిన
ఆకులకు నిప్పెవరు పెట్టారు.
నా హృదయ ప్రార్థనని
నేను వినగలను
అది పక్షులకు పాట నేర్పు
తుంది .
నేనో వరి మొక్కను
భూమిని చీల్చుకుని మొలకెత్తు
తాను
నేల మళ్ళీ మళ్ళీ
పునర్జన్మిస్తుంది.
(పూచి-చెమ్మ చెక్క లాంటి ఆట)
ఒరియా మూలం: సీతాకాంత్ మహాపాత్ర
స్వేచ్ఛానువాదం- వారాల ఆనంద్

"కవిత్వం ఆత్మనుంచి వస్తుంది, అందుకే దాన్ని మనం పుట్టి పెరిగిన భాషలోనే బాగా రాయగలం, అందుకే దాన్ని మనం మాతృభాష అంటాం. అందుకే నాకు ఒడియా నాకు తల్లి లాంటిది. నేను అందులోనే రాయడానికి ఇష్టపడతాను, ఎంతో సంతృప్తిగా రాయగలను"

## గవ్వలు

వాషింగ్ మిషన్
నడువనంటోంది
ఎంతోమందికి ఉపాధి..ఎలుక దేవుడు.

ఆమెనే సూర్యుడు
అతడు-చంద్రుడు
ఆయన విజయానికి ముందు.. ఆమె సంపాదన.

ఏం నడుస్తుంది
నల్ల కుక్కనే
చచ్చినా పుట్టినా.. ఒకే బ్రాండ్ బాజా.

ఒంటరిగా రాలేదూ
ఒంటరిగా పోము కూడా
అందరికీ తోడు.. నీ అంతరాత్మ.

టీవీలో
వార్తలను 'జోకు'తున్నారు
గంట గంటకు పాసంగం.. ఒకే వైపు.

ఉద్యోగులకు
నెలసరి ఆటంకం
రోస్టర్ పద్ధతిన.. జీతాలు జమ.

ఎందరు తల్లులు
సవరిచ్చారో..
చేనులో మొక్క.. నిగనిగలాడుతూ నవ్వుతుంది.

దేవాది దేవుడు
సర్వాంతర్యామి
గూగుల్ మ్యాప్‌లో.. గర్భగుడి ఆలంబనం.

కూర్చున్నచోట ఫించన్
నిల్చున్నచోట జీతం
స్వరాజ్యంలో.. మీలో ఇంకెవ్వరు దరిద్రుడు!

పరిణయమంటే
మనస్సుల కలబోతే కాదు
వ్యక్తిగత అవయవాలకు.. పట్టాభిషేకం.

వేడిగాలి పీల్చి
చల్లగాలిని వదులుతోంది
అగ్నిపునీత.. జగదేక భూమాత.



- జిందం అశోక్
సెల్: 8978532225

# వైవిధ్యమైన అంశాలను స్పృశించిన వినూత్న సవ్వడులు

**"పరిపూర్ణమైన అనుభూతుల ఒరవడులతో**
**గుండె గొంతులో కొట్లాడు ఊసులతో**
**మంజీర నాదమై**
**నవనాడులను పులకింపజేస్తూ**
**నవనవోన్మేషమై సాగిపోయే**
**అందమైన భావవీచిక**
**నిరంతర జీవ వాహిని కవిత"** అంటూ మనోభావవీచికలో కవిత్వా నికి ఒక కొత్త అర్థాన్ని ఇస్తూ కవి త్వంలో వైవిధ్యాన్ని ప్రదర్శిస్తూ విభిన్న అంశాలతో కూడిన "వినూత్న సవ్వడులు"కవితా సంపుటితో మన ముందుకు వస్తున్న పురం మంగ గారిని సాహితీ లోకంలోకి ఆహ్వా నిస్తూ అభినందిద్దాం.పురం మంగ గారు వృత్తి రీత్యా తెలుగు భాషో పాధ్యాయులు.కవులకు ,పండితులకు నిలయమైన ఇందూరు గడ్డపై జన్మించిన మంగ గారు వెలువరిస్తున్న తొలి కవితా సంపుటి ఇది.

కవిత్వం ఎప్పుడు వైయుక్తికవే అంటారు.పురం మంగ గారు .నవ నవోన్వేషమైన అనుభూతిని ఆవిష్క రించడమే కవుల కర్తవ్యం అంటూ "కవుల కర్తవ్యం"లో కవితలు రాసే కవుల బాధ్యతలని వివరించారు.

నిరాశానిస్పృహలతో బలహీన పడుతున్న యువతను తట్టి లేపుతూ
**"ఉవ్వెత్తున ఎగిసిపడే**
**అలలని చూడు**
**పడిన లేచిన**
**అదే ఆత్మవిశ్వాసం"** అంటూ ఆత్మవిశ్వాసంతో సాధించనిది లేదని ఎగిసిపడుతున్న అలలను ఆదర్శంగా తీసుకోమని యువతకి చక్కని సందేశాన్ని అందించారు. అదేవిధం గా
**"గెలుపోటములకు అతీతంగా**
**ముందుకు వెళ్లడమే జీవితం**
**లక్ష్యాన్ని ప్రేమించి సాధన చేయి**
**విజయం తప్పక వరిస్తుంది"** అంటూ పోరాడి గెలువమని ఉద్బోధించారు.

ప్రతి కవి/కవయిత్రి స్త్రీని గురించి కవిత రాయక మానరు. లక్ష్మీకళతో ఉట్టిపడే స్త్రీ లిప్త పాటు కాలమన్న రెస్టు లేక ఉదయం మొదలు పడుకునేంతవరకు గడియారంతో పోటీ పడుతూ విభిన్న అవతారాలతో కుటుంబాన్ని నడిపిస్తున్న స్త్రీని" లలిత లావణ్యవతి లలన"గా పరిచయం చేశారు. ఈ జగతికి మూలం స్త్రీయే అని స్పష్టపరిచారు.






నా (మన) జ్ఞాపకాలు కవితలో గడచిన జీవిత అనుభవాలను జ్ఞాపకాలను తీయని గుర్తులను జ్ఞప్తికి చేసుకుంటూ మనలను బాల్యంలోకి నెట్టి వేసిన తీరు అపురూపంగా ఉంది.

సాంకేతిక విజ్ఞానం అభివృద్ధి చెందిన నేటి కాలంలో సమాచారాన్ని క్షణాలలో తెలుసుకోగలుగుతున్నాం. కానీ సాంకేతిక విజ్ఞానం అంతగా లేని ఆ కాలంలో
**"ఎన్నో కబుర్లను వెతలను**
**తనలో నింపుకొని**
**గాలికి కట్టిన దారంలా**
**ఆకాశంలో విహంగంలా**
**బహుదూరం పయనించి**
**మాటలకు అందని ఊహలను**
**విపులంగా వివరించిన ఉత్తరం**
**నేడు కనుమరుగైనద"** ని పాత జ్ఞాపకంలా మిగిలిన ఉత్తరాన్ని జప్తికి చేసుకోవడం ముదావహం.

కరోనా బాలల చదువులను ఛిద్రం చేస్తూ వారి భవితవ్యాన్ని ఎంతగా దెబ్బతీసిందో కరోనా కోరల్లో చిక్కిన చదువుల తల్లి ఎంతగా తల్లడిల్లిందో "చిన్నబోయిన చదువులమ్మ కవిత"లో కళ్ళకు కట్టినట్లుగా వివరించడం అభినందనీయం.

ప్రతి మనిషి పరోపకార గుణాన్ని అలవర్చుకోవాలి.సహనంతో ప్రవర్తిం చాలి తన బాధలను తనలోనే దాచు కొని ఇతరులకు సంతోషాన్ని అందిం చాలి.తనకు నష్టం జరిగినా ఎదుటి వారికి లాభం చేకూరాలన్న భావాన్ని "ఓ గులాబీ నీకు నా సలాం" కవితలో పొందుపరిచారు.

ప్రతి మనిషి పుట్టుక తర్వాత తన జీవితంలో ఎదుగుదలకు, అభివృద్ధికి మూల కారణమైన త్రిమూర్తులను ఎప్పుడు మరవరాదని, జ్ఞానప్రదాత గురువును కని పెంచిన అమ్మానాన్న లను మరవనివాడే జాతిరత్నమై ఎదుగుతాడని బోధించారు.
**"కనిపెంచిన కన్నపేగు పాశాన్ని**
**నీ అంతరాత్మ గుర్తిస్తే**
**నీ ఎదకవాటం తెరుచుకొని**
**నిండు గోదారల్లే**
**నీ ప్రేమ వాహిని పారుతూ**
**అమ్మ పాదాలను పునీతం చేస్తుంద"**ని ఈ లోకానికి పరిచయం చేసిన అమ్మను అమృతమయి కవితలో తలుచుకోవడం కవయిత్రికి తల్లి పట్ల గల ప్రేమను తెలియజేస్తుంది.

మనిషి జీవితంలో తల్లిదండ్రులు గురువు తర్వాత అత్యంత ఆప్తుడు స్నేహితుడు.ఎవరికి చెప్పలేని విషయాలను మనం స్నేహితులతో పంచుకుంటాం.తన సాహిత్య వ్యాస ంగం కొనసాగడానికి ప్రోత్సహించి, వెన్నుదన్నుగా నిలిచిన కలం స్నేహంను తలచుకుంటూ కవితను రాయడం ఆమెలోని విజ్ఞతకు ప్రత్యేక.

కనుమరుగవుతున్న తెలుగు భాష పూర్వవైభవాన్ని తీసుకురావాలని ప్రతి ఒక్కరిని కోరుతూ "తెలుగు వెలుగు" ను అద్భుతంగా అందించిన తీరు అభినందనీయం.
**"కల్మషం లేని**
**కలతలు లేని**
**చింతలు లేని**
**భావి భారత పౌరులు"**బాలల గురించి ఓ చక్కని కవిత ఈ సంపుటిలో చోటుచేసుకుంది.

ఈ కవితా సంపుటిలో చోటు చేసుకున్న కొన్ని సుబోధక వాక్యాలు
**"గెలుపోటములకు అతీతంగా ముందుకు వెళ్లడమే జీవితం"**
**"గెలుపులు ఎన్ని వరించినా ఒదిగి ఉండడం నేర్చుకో"**
**"ధనాన్ని కోల్పోతే కొంత నష్టం వ్యక్తిత్వం కోల్పోతే చాలా నష్టం"**
**"మనిషికి మరణం ఉంటుంది కానీ మంచితనానికి మరణం ఉండదు"**
**"నలుగురు నీకై వచ్చేలా జీవించు నలుగురు నీకై తపించేలా బతుకు"**

ఇంకా ఈ సంపుటిలో కరోనాపై , కరోనా చేసిన గాయాలపై మూడు కవితలు ప్రియమైన తన మనసుకు నచ్చిన వ్యక్తిపై కవితలు, అంతే కాకుండా అలంకారాలకు సంబంధించిన కవితలు, గుణింతాలతో కవితలు, శ్రీశ్రీ ,అల్లూరి సీతారామ రాజు లాంటి గొప్ప వ్యక్తులపై కవితలు,విలువలు మానవత్వం, ప్రకృతి, త్రివర్ణ పతాకం, గణ తంత్రం, ఎస్పీ బాలసుబ్రమణ్యం , వైద్యులు తదితర అంశాలపై కవి త్వాలు చోటుచేసుకున్నాయి, ఇంకా కవయిత్రిలో హాస్యరసం కూడా నెలకొందని వారు అందిం చిన హాస్య కవితలు తెలుపుతు న్నాయి. మొత్తం పై విభిన్నపార్శ్వాలలో విభిన్న అంశాలపై కవితలతో కూడిన వినూత్న సవ్వడులు పేరుకు తగినట్లుగా రూపుదిద్దుకుంది.పురం మంగ గారి నుంచి మరిన్ని చక్కని కవితలను ఆశిస్తూ

**ప్రతులకోసం :**6-149/4/డిడి/48, డాలర్ డ్రీమ్స్ విల్లాస్, సాయి నాథ ఆశ్రమం దగ్గర , బౌరంపేట, హైదరబాద్ 9666375277



-వైరాగ్యం ప్రభాకర్,
9014559059

## రుబాయిలు

పేదవాడి పేరుచెప్పి బతకనేర్చె నాయకులు
ఆకలిమంటలతో చలి కాచుకునే నాయకులు
ప్రజాస్వామ్య దేశంలో రాచరికపు పోకడలే..
అడ్డంగా బలిసిపోయె అడ్డులేక నాయకులు !!

పెరుగుతున్న ధరలపైన అదుపులేదు సిగ్గుచేటు
పేదవారి బతుకులేవి మారలేదు సిగ్గుచేటు
ఖజానాలు దోచుకుంటు చిల్లరనే విసురుతుంటె..
చెయ్యిచాచు జనాలలో మార్పులేదు సిగ్గుచేటు !!

కులమతాల ఉచ్చులోన చిక్కుకున్న జనాలు
రాజకీయ రొచ్చులోన పొర్లుతున్న జనాలు
సంక్షేమం పేరుచెప్పి జేబుచిల్లు పెట్టినా..
వంగివంగి నాయకులకు మొక్కుతున్న జనాలు !!

రాజరికం ఏలుతున్న ప్రజాస్వామ్య రాజ్యంరా
వ్యక్తిపూజ భజనచేయు మూర్ఖులున్న రాజ్యంరా
బడాచోరు వ్యాపారులు చట్టాలను కొంటుంటే..
ఓటుకొక్క రేటుకట్టి అమ్ముతున్న రాజ్యంరా !!



-పేరిశెట్టి బాబు
9247170800

## నిశీధిలో వెన్నెల

నడిచిన దూరం కొన్ని వేలమైల్లు....
పాదాలు కందిపోయి.....
మార్గమధ్యలో ఒక చోట ఆగి.....
అలసి సొలసి ఒక ఓదార్పుకై నిరీక్షిస్తూ నేను.....

గమ్యం చేరే వరకు విశ్రమించక....
ఆశయసాధనలో అలుపెరుగక....
ఓ పాత్ర పోషిస్తూ నేను,

జోరు వర్షం లో అయినా చిమ్మ చీకట్లో వెలుగుకై
పదాల మధ్య దాక్కున్న అక్షరమై మిగిలున్నా....
అర్థాన్ని వెతుకుతూ ఆశ్చర్యపోయేలా....
నిరీక్షిస్తున్నా....

ఒక్కోసారి గంద్ర గొడ్డలి పదునులా....
ఒక్కోసారి నిశీధిలో ప్రసరించే
చందమామ వెన్నెల వెలుగులా....



-దడిగె నరేష్
00968
93029220

## సౌందర్య సాధనం

అమ్మ దువ్వెనతో
తల దువ్వుకున్నప్పుడల్లా
లాక్కొని నోట్లో పెట్టుకోవాలని
దాంతో ఆటలాడుకోవాలని
తెగ ఆరాట పడేది చిన్నప్పుడు
ఆ దువ్వెనను ఆటబొమ్మలకన్న
ఎక్కువగా ఇష్టపడేదప్పుడు.

పెరిగినకొద్దీ వాడకం తెలిసినకొద్దీ
దాన్ని ఆట కోసం కాకుండా
అందాలకు మెరుగులద్దేదిగా
ఉన్న స్టైల్ ని పెంచేదిగా
యవ్వనంలో ఒక సహచరుడిగా
జేబు భూషణం అయ్యింది.

చిత్తుగా వెంట్రుకలున్న తలైనా
కేశసంపద తరుక్కుపోయిన
బట్టతలైనా
ఉన్న జుత్తును చక్కగా దువ్వి
చిక్కులుపడ్డ కురులను సరిచేసి
ముఖారవిందాన్ని
వెలుగు జిలుగులతో
మెరుగులద్ది
పొంగిపోతుంది ఆ దువ్వెన.
అందాల సాధన అపురూప కానుక
తన పళ్ళతో తలను శుభ్రం చేసి
వెంట్రుకల మొదల్లలో జీవం నింపి
మానవుని మేలుకోరుకుంటుంది.

నిద్రలేచిన ముఖం దువ్వని తలతో
ఓ అనాకారి రూపమే దర్శనమిస్తది
విలువలేని రూపమే అగుపిస్తది.

దువ్వెన జేబులో ఉన్నా
డ్రెస్సింగ్ టేబుల్ మీదున్నా
అది కోరుకునేదొక్కటే
అందంగా చూపడమే
అందరికీ సమానంగా
ఉపయోగపడడమే.

జుత్తును దువ్వుకున్నట్టు
ఇంటిని ఊడ్చి శుభ్రం చేసుకున్నట్టు
నడవడికను చక్కగా
ఏ చిక్కులకు తావివ్వక
గొప్ప వ్యక్తిత్వానికి
దారులు వేసుకుంటూ
అంతర్ సౌందర్య మెరుగులద్దుకోవాలి.
నేర్చుకోవాలెగానీ
ప్రతి పరికరం ఓ గురువే
ప్రతి వాడుకా మనకు
ఓ ప్రియమైన వరమే.



-మంచికట్ల లక్ష్మణ్
9494800112

పుస్తక సమీక్షలు

# 'పూర్ణ చంద్రోదయం' డా॥జి.వి. పూర్ణచందు సాహిత్యానుశీలన

ఆచార్య మాడభూషి సంపత్ కుమార్, సారధ్యంలో 'మాడభూషి సాహిత్య కళాపరిషత్', నిర్వహించిన డా॥జి.వి. పూర్ణచందు సాహిత్యం, జీవితం, వ్యక్తిత్వం, నదన్ను సందర్భంలోని 70 మందికిపైగా ప్రముఖ సాహితీవేత్తల పత్రాల సాహిత్యానుశీలన గ్రంథం యిది. నిరంతర అధ్యయనం, బహుముఖీన ప్రతిభ, పరిశోధనాసక్తి, దార్శనికత డా॥జి.వి. పూర్ణచందును తెలుగు సాహిత్యంలో సుప్రతిష్టత సాధించే 180 గ్రంథాల రచయితగా, తీర్చిదిద్దింది. 1975లో తొలి వ్యాసంతో సాహిత్య రంగ ప్రవేశం చేసిన డా॥ పూర్ణచందు చైతన్యవంతమైన భాషా సాహిత్య, సాంస్కృతిక చరిత్రాత్మక ప్రస్థానం ఈ సంపుటి, గ్రంథస్థం చేసింది. వృత్తికి ప్రవృత్తికి మధ్య భేదం లేని సాహితీవేత్తగా, చరిత్ర పరిశోధకునిగా తెలుగునాట శారీరక, మానసిక ఆరోగ్య సంపదను బహుముఖ ప్రజ్ఞగల డా॥ పూర్ణచందు నిరంతర రచనా వ్యాసంగంతో అర్ధ శతాబ్దిపైగా సేవలు అందిస్తున్నారు. తెలుగులో తొలి ఆహార చరిత్ర గ్రంథ రచయితగా, ఆహార సంస్కృతి చరిత్రపై 20కిపైగా పరిశోధనాత్మక గ్రంథాలు రచించిన డా॥ పూర్ణచందు, రచయితగానే కాకుండా భాషోద్యమ క్రియాశీలిగా, వైద్యునిగా, మినీ కవితా ఉద్యమకారునిగా, శతాధిక గ్రంథకర్తగా పరిపూర్ణత సాధిస్తున్నారు. 23వ ఏట రాసిన మనో విశ్లేషణ గ్రంథం 'అమలిన శృంగారం' భాష, సాహిత్య, సంస్కృతీ చరిత్ర వ్యాస సంపుటి 'తెలుగు కోసం', తెలుగు పలుకుల మాధుర్యాన్ని చాటిచెప్పిన 'మాటల ముచ్చట్లు', 'దీన జన బాంధవుడు', వేముల కూర్మయ్య జీవిత చరిత్ర, తొలి ఐతిహాసిక నవల 'సప్తసింధు', చారిత్రక నవల 'తెలుగు ధీర', 'జీవితం కథలు, అత్యంత అల్పాక్షరాలతో అనంతార్థం యిచ్చే 'ముక్కాలు' కవితలు, యిటీవల జాగృతిలో ప్రచురితమైన 'తాంబూలం' సీరియల్ వ్యాసాలు పూర్ణచందు ప్రతిభా వ్యుత్పత్తులకు అద్దం పడ్తున్నాయి. సాహిత్యపరమైన రచనలు, భాష, చరిత్ర, ఆహార చరిత్ర, జీవిత చరిత్రలు, మహిళలకు సంబంధించిన రచనలపై విశ్లేషణలు మాత్రమే ఈ సంపుటిలో ఉన్నాయి. మరో అనుశీలన గ్రంథం రావలసి నంత విశేష విశ్లేషణ జరగవలసి వుంది. డా॥ పూర్ణచందు, సమగ్ర భాషా సాహిత్య, సాంస్కృతిక, వైద్య రంగాలలో సాధించిన అపురూప అనితర సాధ్యమైన సాహితీ సంపద, తెలుగు సాహితీ ప్రస్థానంలో మరపురాని మైలురాళ్ళు.




**ప్రతులకు:**
డా॥జి.వి. పూర్ణచందు
1వ అంతస్తు, సత్‌నం టవర్స్
బకింగ్‌హామ్‌పేట పోస్టాఫీసు
ఎదుట, రాజగోపాలాచారి వీధి
గవర్నర్ పేట
విజయవాడ-520 002.
సెల్:94401 72642



-జయసూర్య
సెల్:9014948336
9394775088

## యవ్వనం కాలిపోతుంది

యవ్వనం కాలిపోతుంది
సిగరెట్ పొగలో
మత్తు సెగలో
ఒక్కసారిగా కాదు
అభివృద్ధికి
విడతలుగా నిధులు
మంజూరైనట్లుగా
అధికారులు
విడతలుగా విధులు
నిర్వహిస్తున్నట్లుగా
గమ్మత్తుగా
యవ్వనం కాలటానికి
ఓ మూడు విడతలు
మొదట మెదడు అంటుకొని
పిదప ఊపిరి తిత్తులు
తదుపరి యవ్వనమంతా
కాలుతూనే ఉంది..
ఇప్పుడంతా
టెంపరరీ సుఖాలే
అందుకే పొగలు
గాల్లో కలిసినట్లు
యువ ప్రాణాలు
గాల్లో కలుస్తున్నవి
బాధ్యతల్ని
ఎత్తుకోవాల్సిన యువతరం
మొత్తుకుంటున్నా
మత్తునే మోస్తున్నరు
యవ్వనమంతా
అదుపుతప్పి
చిత్తవుతుంది
ఆదర్శం నెట్ కెక్కి
హీరోలని అనుకరిస్తుంది
హీరో పొగను
రౌండ్లు రౌండ్లుగా చిమ్మేవాడే!!
పైగా
ధూమపానం ఆరోగ్యానికి హానికరమని
ఓ వ్యాపార ప్రకటనలా
ఆరోగ్య ప్రకటన
ప్రకటన పక్కకు నెట్టి
తెర బొమ్మలా స్టైల్ ని పట్టి
యవ్వనం కాలిపోతుంది



- సాకి.
9949394688

## సృష్టి (వి)చిత్రం బోధపడుతుంది

చిరుతపై కనిపించే చుక్కలు
సప్తవర్ణాల పక్షుల ఈకలు
నీటిలో కదిలాడే చేపల వర్ణాలు
పండ్లుపై ఉండే
కమ్మని పొరలను చూస్తే
సృష్టి కళాత్మక ధోరణి
బోధపడుతుంది.

కొమ్మల్లో కోయిలమ్మల పాటలు
కొండకోనల్లో చిరుగాలుల సవ్వడులు
విత్తులు విత్తుల రంగులు
సెలయేర్ల సరిగమలను చూస్తే
భగవంతుని నైపుణ్యం బోధపడుతుంది.

ఉత్సుకత నిండిన మనసులు
పనులను భిన్నంగా చేసే ఆలోచనలు
ఆత్మశక్తి ఆవహించిన ప్రవర్తనలు
ఏటికి ఎదురీదే ధైర్యాలను చూస్తే
దేవుని దూరదృష్టి బోధపడుతుంది.

మంచు పొగలోని చల్లని రాగాలు
ఆవుదూడల ప్రేమైక పిలుపులు
పచ్చని చెట్ల యుగళ గీతాలు
కోవెల జే గంటల
ప్రతిధ్వనులను చూస్తే
సృష్టి ధర్మం బోధపడుతుంది.

వెదురు వేణువు లోని సరిగమలు
చిట్టి చీమల్లోని
శ్రమ జీవన సౌందర్యాలు
సాలీడు లోని అల్లిక చతురతలు
గిజిగాడులోని
సాంకేతిక నైపుణ్యాలను చూస్తే
సృష్టి (వి)చిత్రం బోధపడుతుంది



-పిల్లి హజరత్తయ్య,
9848606573

## నిశా పుష్పాలు

హేమంతపు మబ్బుల పందిరి
నిశిరాతిరి వేళలో
తన ఒడిలో దాచుకున్న
నిశా పుష్పాల నిధులను
అహిమాంశుడు తూరుపు పరదా
మాటునుండి తొంగి చూడకముందే
తుషార బిందువులను ఒడుపుగా
పందిరి కిందున్న పచ్చని పత్రాలపై
ప్రేమగా చిలకరించింది
అలా జారిన హిమరావాలు
మంచు ముత్యాలై కిందున్న
పసి పసిరికలపై జలజల రాలాయి.

పందిరి కింద
ఏలాంటి అచ్ఛాదన లేకుండా
అలా తచ్చాడుతున్న పశుపక్ష్యాదులు
సంచెడు మంచు ముత్యాలతో
ఒళ్లంతా తాపడం చేయించుకున్నాయి.

పట్టపగలు
భానుని కిరణపు బాణాలు
మంచు ముత్యాల పొట్టను
నిట్టనిలువునా చీల్చడంతో
కన్నీటి చినుకులు రాల్చుతూ
కడలి గర్భంలో కలిసిపోయాయి.

సాయం సమయాన నదీ ద్వీపంలో
సూర్యాస్తమయ అందాలను
వీనుల విందుగా వీక్షిస్తున్న
నవయవ్వన ద్వయం
ఒకరి కలల వాకిలిలోకి
ఒకరు అడుగిడిన వేళ
తన్మయత్వంతో తమ దేహాలను
పున్నమి నాగుల్లా
పెనవేసుకుంటున్నాయి
వారి ఉచ్వాస నిశ్వాసాలకు
ఆ పగడపు ద్వీప ప్రాంగణమంతా
ఉష్ణ మండల ప్రాంతమైంది.

ఆ దేహాల సరసపు రాపిడికి
స్వేదపు కాలువలు పారాడి
విరసపు వాహినిలో సంగమించగా..
సంగమ స్పర్శకు జలధిగ జలాలు
అందెల సవ్వడులు మ్రోగిస్తూ
శృంగార గీతం పాడుతున్నాయి



-గంగాపురం శ్రీనివాస్
9676305949

## మార్క్సిజాన్ని సాహిత్యం వైపుకు మళ్ళించిన విమర్శకుడు 'రారా'



### బుద్ధిజీవులు

వాస్తవిక జీవితాన్ని ప్రతిబింబించడమూ, ఉన్నత జీవన యానానికి మార్గం చూపించడమూ, ఉత్తమ హృదయ సంస్కారానికి ప్రేరణ ఇవ్వడమూ, సాహిత్య లక్ష్యాలుగా చెలామణి కావడం లేని ఈ స్థితిలో వికృతవాద సాహిత్యానికి అడ్డుకట్ట వేయకపోతే కలిగే ఉపద్రవాన్ని ముందే పసిగట్టిన మహా మేధావి 'రారా'.

(రాచమల్లు రామిరెడ్డి ) రారా గా ప్రసిద్ధి చెందిన వీరు(ఫిబ్రవరి 28 1922 -నవంబర్ 24 1988) కడప జిల్లాలోని పైడిపాలెం లో జన్మించారు. తండ్రి బయప రెడ్డి తల్లి ఆదిలక్ష్మమ్మ . ప్రాథమిక విద్య పులివెందులలోని జిల్లా బోర్డ్ హైస్కూల్లోను, ఇంటర్ అనంతపురం లోని నాటి దత్తమండల కళాశాలలోను, తరువాత మద్రాసులోని గిండి ఇంజనీరింగ్ కాలేజీలోనూ చదివాడు. ఆ రోజుల్లో మహాత్మా గాంధీ జైలులో చేపట్టిన నిరాహార దీక్షకు మద్దతు తెలుపుతూ సమ్మె చేసినవారిలో రారా కూడా వున్నా డు. క్షమాపణ చెప్పడానికి కూడా నిరాకరించడం వలన కాలేజీ నుంచి బహిష్కరించారు. అందులో తన సహవిద్యార్థి చంద్ర రాజేశ్వర రావు కూడా వున్నారు. ఆ తర్వాత విజయవాడలోని విశాలాంధ్ర పత్రికలో ఉప సంపాదకునిగా పని చేసినా ఎక్కువ రోజులు ఉండలేదు. కొంత కాలం ఉల్లిగడ్డల వ్యాపారం కూడా చేశాడు. 1962 నాటికి కొంతమంది మిత్రుల సాన్నిహిత్యంతో సాహితీ రంగంలోకి పూర్తిగా ప్రవేశించాడు. వారిలో కేతు విశ్వనాథ రెడ్డి, బంగోరె, రామప్ప, నంద్యాల నాగిరెడ్డి లు కూడా వున్నారు. ఫలితంగా 'సంవేదన' అనే పత్రిక 1968 ఏప్రిల్ లో తొలి సంచిక వెలువడింది. ఆ సంచికావిష్కరణ శ్రీశ్రీ అధ్యక్షతన జరిగింది. కాని ఎక్కువకాలం కొనసాగలేదెందుకో. కొంత కాలం తర్వాత 1970లో రష్యా దేశానికి వెళ్ళి మాస్కోలో తెలుగు అనువాద కునిగా ఆరేళ్ళ చేసి వారికి అద్భుతమైన సేవలందిచారు రారా. అందువల్లనేనేమో భవిష్యకాలంలో మార్క్సిస్టు సిద్ధాంతాన్ని సాహిత్యానికి అన్వయింప జేసి సమాజం వైపుకు మళ్ళించాడు. తన జీవితంలో ఎక్కువ భాగం సమీక్షలే చేసినా గొప్ప విమర్శ కునిగా ప్రసిద్ధికెక్కారు. 1957-1959 మధ్యకాలంలో రారా రాసిన కథలు, 1960లో 'అలసిన గుండెలు' పుస్తక రూపంలో వచ్చాయి. ఇవి కాక అనేక అనువాదాలు గోర్కి కథలు, చేహోవ్ కథలు , అనేకంగా అనువదించారు రారా. గియోర్గి లూకాచ్ అనే హంగేరియన్ శాస్త్రవేత్త రాసిన ' చారిత్రక నవల' అనే గ్రంథం లో చేసిన సూత్రీకరణలను ఆధారం చేసుకొని ' కొల్లాయి గట్టితేనేమి" నవలను గొప్పగా సమీక్షించాడు. అలాంటి విమర్శ అంతకు ముందెన్న డూ ఎవ్వరూ రాసివుండలేదని సాహితీ విజ్ఞుల ప్రశంసలు. రారా విమర్శ కొరడా లాంటిది. దానితో కొట్టిన దెబ్బ దశాబ్దాలుగా నిలిచిపో తుందంటారు. తెలుగులో సాహిత్య విమర్శ బాగాలేదనీ చెడుధోరణులను ఎత్తి చూపిస్తూ కొన్ని కర్తవ్యాలను ఎంచుకున్నారు.రారా తన విమర్శలలో. దిగంబర కవిత్వాన్ని దుయ్యబడుతూ 'ఈ సమాజం ఎంత పాడైపోయినా దిగంబరులు రాసిన కవిత్వం అంతగా దిగజారిపోయిందా?' అని నిలదీశాడు. నక్సల్ ఉద్యమాన్ని కూడా రారా వ్యతిరేకించారు. చాలామంది సమీక్ష వేరు, విమర్శవేరు అంటారు. ఈ సంప్రదాయాన్ని మార్చి గ్రంథసమీక్షల స్థాయిని పెంచి గొప్ప విమర్శలు రూపొందించిన ఘనత రారా తోనే ప్రారంభమైందనడం అతిశయోక్తి కాదు. ఒక రచనను విమర్శించేటప్పుడు ఆ రచయిత సాహిత్య జీవితాన్ని మాత్రమే ప్రస్తావించాలి గాని, అతని సాహిత్యేతర జీవితాన్ని విమర్శస్తే అది అక్రమమైన విమర్శ అవుతుంది అంటారు రారా. గ్రంథ రచయిత ఎటువంటి వాడైనా, చివరకు స్నేహ బాంధవ్యాలున్నా ఆ ప్రభావం అతని పుస్తక విమర్శ మీద పడకూడదని రారా అభిప్రాయం. సాహిత్యానికి హృదయమే కేంద్రం హృదయమే ఆలంబన, హృదయమే హద్దు అది మీరిన నాడు అందులో సాహిత్యం వుండదని ఆయన ఉద్దేశ్యం. రారా విమర్శ గ్రంథాల వివరణకు వస్తే ఒకటి ' సారస్వత వివేచన " రెండు ' వ్యక్తి స్వాతంత్ర్యం- సమాజ శ్రేయస్సు' ఇటీవలే యుగ సాహితీ వారు, రారా స్మారక సమితి వారు కలిసి రారా సాహిత్యాన్ని నాలుగు సంపుటాలుగా వేశారు. పై చెప్పిన రెండు విమర్శ గ్రంథాలు కలిపి సాహిత్య సర్వస్వం రెండో సంపుటిగా తెచ్చారు.'సారస్వత వివేచన'లో 18 వ్యాసాలు, వ్యక్తి స్వాతంత్ర్యం- 'సమాజ శ్రేయస్సు' లో 44 వ్యాసాలున్నాయి. ' ఇక అవార్డుల విషయానికి వస్తే 'సారస్వత వివేచన ' గ్రంథానికి రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. 'అనువాద సమస్యలు" అనే గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు బహుకరింపబడింది. ఈ గ్రంథం Alexander froser tytler రాసిన 'essay on the principles of translation ' (1791)అనువాద ప్రక్రియ మీద తొలి పుస్తకం. ఈ పుస్తకాన్ని ప్రమాణికంగా తీసుకొని 1987 లో రాసినదే 'అనువాద సమస్యలు' ఇది ప్రత్యేకించి ఆంగ్లం నుండి తెలుగు అనువాదం చేయడంలో కలిగే ఇబ్బందులును తెలియజేసే అత్యుత్తమ గ్రంథం. వీరిని గురించి కొంతమంది ప్రముఖులు అన్న మాటలు. ' రారా క్రూరమైన విమర్శకుడు' అన్నాడు శ్రీశ్రీ. ' రాచమల్లు రామచంద్రారెడ్డి గదాఘాతం నుండి తప్పించుకున్నది బహుశా నేనొక్కడినే'- అన్నారొకసారి సరస్వతీ పుత్ర పుట్టపర్తి నారాయణాచార్యులు. ఎంత గొప్ప విమర్శకుడికైనా ఇంతకంటే ఘనమైన ప్రశంస ఏముంటుంది?. తెలుగు వాక్యం 'చలం' చేతిలో ఎంత సౌందర్యాన్ని సంతరించుకున్నదో, రారా చేతిలో తెలుగు సాహిత్య విమర్శ కూడా పదును దేలి అంత శక్తివంతమైన మారణాయుధమై కవుల, రచయితల గుండెల్లో గుబులు రేపింది. ఒక దశాబ్దం పాటు జరిగిన తీవ్ర కృషిలో భాగంగా ఎన్నో 'కంప్లీట్ ఆర్టికల్స్' అనదగినవి వున్నాయి. సాహిత్యంలో సమాచారానికి చోటివ్వకూడదని రారా అభిప్రాయం. వీరొక మాటంటారు... 'అనవసరమైన ప్రతి భావమూ సాహిత్య వ్యతిరేకమే, అనవసరమైన ప్రతి మాట సాహిత్య శత్రువే' అని. విమర్శలు, సమీక్షలు రూపాంతరం చెంది పూర్తి 'పొగడ్తలు' గా మారిపోతున్న ఈ తరుణం లో నిష్పక్షపాత, నిర్భయ, నిర్మొహమాట విమర్శల వైపుకు U--turn తీసుకోవలసిన అవసరం ఎంతైనా వుంది, ఈ విమర్శ ప్రక్రియ ను పతాక స్థాయిలో నిలపడానికి తీవ్ర కృషి చేసిన 'రారా ' బాటలో పయనించడమే వారికి మనమిచ్చే నివాళి.



- మాయకుంట్ల నారాయణరెడ్డి
9989686603

## అక్షరాంజలి

మా అందమైన ఆకుపచ్చని అరణ్యంలో
విధి రేపిన పెను తుఫానులో
ఓ మమతల మహావృక్షం నేలకొరిగింది.

తమ్ముడు ఇలలో
నీ చితిమంటల అగడు ఆరిందేమో కానీ
నీ జ్ఞాపకాలు సమిధలై
దహించి వేస్తున్న ఈ గుండెలో
ఆరని అగ్ని కీలల నెగడు ఆరేదెలార

వైద్యులు నా ఆయువు రేఖ గురించి
జ్యోతిష్యం చెప్తే చలించని నేను
ఇక నా చిరునవ్వును ఎవరు జయించలేరు
నేను విశ్వవిజేతను అనుకున్న

సిద్ధుడు బుద్ధుడైన ఓ యోగమేదో నాలోను ఉందనుకొని
ఆ తాత్వికతకు తాదాత్మ్యం చెందాను

కానీ కాలం ఆడిన ఆయువు ఆటలో
నువ్వు కనుమరుగై సముద్రమంత శోకాన్ని మాలో నింపావు
ఈ కన్నీటి అలలు చెక్కిటి తీరాన్ని
బలంగా తాకుతున్న ప్రతిసారి నా ఓటమిని గుర్తు చేస్తున్నాయి
విస్తృతమైన ఈ విలాపాన్ని మోయలేక మనసు ఘనీభవించింది
దుఃఖాన్ని ఉధృతంగా ఎంత కొత్తగా పరిచయం చేసావురా
నరం నరం కణం కణం కన్నీళ్ళే ప్రవహిస్తున్నట్టు
కనీసం కలగానైనా వచ్చి ఈ కన్నీరు తుడిచి వెళ్ళు
మరణం నీకు భౌతిక మాత్రమే
మా జ్ఞాపకాల్లో మా జీవితాల్లో
సదా జీవన గంగలా ప్రవహిస్తూ నే వుంటావు
పావన మూర్తివై నిలిచేవుంటావు
అందుకో ఈ అక్క అక్షరాంజలి
ఆఖరి అశ్రునివాళి.

(మా తమ్ముడు శ్యామ్
శ్యామ్ సుందర్ రెడ్డి తాటికొండ) స్మృతిలో)



-కళ తాటికొండ
9989891558

పుస్తక సమీక్ష

## మహామంత్రి యుగంధర'-డింగరి రామాచార్య పద్యాకృతి

### ఏకాశిలానగరం చారిత్రక దృక్పథం

తొలి తెలుగు రాజులైన శాతవాహనుల పాలన తర్వాత కాకతీయ వంశస్తులు ఏకచ్ఛత్రాధిపత్యంగా పరిపాలన కొనసాగించారు. వీళ్ళు దాదాపుగా రెండువందల సంవత్సరాలు అలుపెరుగని సాహసంతో ఐదుగురు కాకతీయ చక్రవర్తులు రాజ్యపాలన సుఖశాంతులతో పరిఢవిల్లిందని చెప్పవచ్చు.వీరిలో రుద్రమదేవి భారతదేశంలోనే మొదటి మహిళ చక్రవర్తి కావడం గొప్పవిషయం. కాకతీయుల రాజధాని ఓరుగల్లు.దీనినే ఏకాశిల నగరం, ఆంధ్రనగరమని పిలిచేవారు.ఆనాటి సాహిత్యం, శాసనాలు చదివితే ఇలాంటి విశేషాంశాలు తెలియవస్తాయి. రాజకీయ, సామాజిక, సంగీత, సాంస్కృతిక పరంగా తమ పాలనలో ఒక ప్రత్యేక ముద్రను కలిగిన కాకతీయులు శిల్ప నిర్మాణంలోను ప్రత్యేక శైలిని కనబరిచారు. శిల్పకళల గురించి చెప్పుకుంటుపోతే 'కాకతీయ శిల్ప'మనే వ్యవహరిస్తాము. ఇందులో త్రికుటాల నిర్మాణం, రుద్రేశ్వరాలయం(వేయి స్తంభాల గుడి), రామప్ప దేవాలయం, కాకతీయుల కళాతోరణం, నంది శిల్పం, రాతిపూతలు, మనోహరమైన స్తంభశిల్పం, రంగంటప శిల్పం, నాట్యమంటప శిల్పం, ఆలయం లోపలి పైకప్పు పద్మం,హంస శిల్పాలు వారి శిల్పకళా నైపుణ్యానికి నిదర్శనం. సాహిత్య వినీలాకాశంలో మార్కండేయ పురాణానువాదం,ప్రతాపరుద్ర యశోభూషణం, నృత్య రత్నావళి వంటి గ్రంథాల ఆవిర్భావం పేరిణి నృత్యం, తిక్కన మహాభారతం పురుడుపోసుకున్నది కాకతీయుల కాలంలో ఓరుగల్లు పట్టణంలో జరగడం విశేషమే. క్రీడాభిరామం లాంటి గ్రంథాలు వీరి చరిత్రలను తెలియపరుస్తుంది.

### -డింగరి రామాచార్య పరిచయం- పద్యప్రభంజనం

తెలంగాణ సాహిత్య పరంపరలో విరబూసిన కవి రత్నములలో ఒకరు కీ.శే.డా.డింగరి రామాచార్య. ఈయన జగిత్యాల జిల్లాలోని కోరుట్ల పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రాచ్యార్యులుగా సేవలు అందించారు. తల్లిదండ్రులు గోపాలరత్నమ్మ, రంగాచార్యులు. ఈయన పద్యకవిత్వం, నవల, చారిత్రక, పౌరాణిక కావ్యాలు రాయడంలో దిట్ట. డింగరిగారు దాదాపు 18 రచనలు చేసిన అపార పండితుడిగా, విమర్శకుడిగా, మానవతావాదిగా సాహితీలోకంలో ప్రశంసలు అందుకున్న కవి. ఈయన రాసిన కావ్యాలు 1.వ్యాసమంజరి 2.వానమామలై జగన్నాదాచార్యుల కావ్యాలు, రైతు రామాయణం పరిశీలన 3.రుచిరార్థ వ్యాకరణ దీపిక 4.మాతృమూర్తి(గీతమాలిక) 5.కొండగట్టు ఆంజనేయస్వామి వారి మేలుకొల్పు, సుప్రభాతం,స్తుతిమాల 6.మహామంత్రి యుగంధరుడు (పద్యకావ్యం) ఇలా చెప్పుకుంటూపోతే వారు అందించిన గొప్ప రచనలు సమాజానికి చేరవేయడం ఆనందదాయకం.






పండితలోకం వీరికి ఎన్నో అవార్డులు, రివార్డులు, బిరుదులు అందించారు. వాటిలో కొన్ని 1.రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు(ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం(1997) 2.సాహిత్య విమర్శ విశిష్ట పురస్కారం(2006) 3.పాలకొల్లు కళాలయ విశిష్ట పురస్కారం(2006-పశ్చిమగోదావరి జిల్లా) 4.దేవులపల్లి కృష్ణశాస్త్రి స్మారక అవార్డులు అందుకున్నారు. విమర్శకాగ్రణి, సరస వ్యాఖ్యాత,కవి శిరోమణి, కవి సుధానీశు,సాహిత్య శీతానీశు, కవితిలక, సాహితీ బ్రహ్మ లైఫ్ టైమ్ అచీవ్‌మేంట్ లాంటివి అందుకొని వర్ధమాన కవులకు, రచయితలకు మార్గదర్శకుడిగా ఉంటూ తెలంగాణ సాహిత్యానికి వెన్నుదన్నుగా ఉన్నారు. కానీ సాహితీ సమాజం మాత్రం డింగరి రామాచార్య విస్మృతకవిగా మిగిలిపోయాడు అనడంలో అతిశయోక్తి కాదనడంలో ఎటువంటి సందేహములేదు.

### 'మహామంత్రి యుగంధర' కావ్యం విశ్లేషణ

మహామంత్రి యుగంధరుడు అనగానే ప్రతాపరుద్రుడు గుర్తుకువస్తాడు. ఓరుగల్లు ప్రాంతం కాకతీయుల సామ్రాజ్యానికి పెట్టని కోటగా,తెలుగువారి పౌరుషం, తెలంగాణ జాతి గౌరవాన్ని తెచ్చిపెట్టినవారు. అలాంటి గొప్ప చారిత్రక రాజుల వైభావాన్ని కళ్లకుకట్టినట్లు డా.డింగరి రామాచార్య చారిత్రాత్మక పద్యకావ్యంగా రచించడం ముదావహం. ఇది కల్పిత కావ్యంగా కాకుండా,ఒక చారిత్రాత్మక చరిత్రను తెలుగువారికి అందించిన పండిత కవి ధన్యుడనే చెప్పాలి. ఆధునిక కవుల చెవులకెక్కింది కనుకనే వాళ్ళు ఎదో విధంగా రాసేసి పండితుల నుకోవడం పరిపాటి అయినది.అందులో భాగంగానే "కాదేదీ కవితకనర్హం" అని శ్రీశ్రీ కవిత రూపకంగా తెలియపరిచాడు. కానీ సమర్థుడైన కవి కవితకు ఏది అర్హమైందో చూపిస్తాడు. ప్రఖ్యాతేతివృత్తంతో ఒక కావ్యం ఉద్భవిస్తే దాని ప్రభావం ఎలా ఉంటుందో తెలుసుకోవడానికి 'మహామంత్రి యుగంధర' పద్యకావ్యం మంచి ఉదాహరణగా చెప్పవచ్చు. "తెలుగు లక్కన్న మాదన్న తిమ్మరుసులు/మంత్రివర్యులకెల్లను మార్గదర్శి/చతురమంత్రి యుగంధర చరితమరసి/తేటపరచ నెంచితి జగద్ధితము కొరకు" అంటూ డా.డింగరి రామాచార్య ఆలోచన ఏమిటో ఈ పద్యం ద్వారా మనకు స్ఫురిస్తుంది.కుదేలైన సామ్రాజ్యాన్ని మన కళ్ళ ముందు నిలబెట్టి,అలసిపోయిన శరీరాలకు తిరిగి మనలో నూతన ఉత్సాహం నింపే ప్రయత్నమే 'మహామంత్రి యుగంధర'కావ్య పరిమళం. యుగంధరుడు గురించి డా.జైకిషన్ గారి మాటల్లో "ఖానే జహాన్ మాలిక్ మక్బుల్ తెలంగాణే యుగంధర బిరుదాంకితుడైన నాగయగన్న మంత్రి" అని తన వ్యాసంలో తెలిపినారు. ఢిల్లీ సుల్తానుల పాలనలో నాయబ్ వజీర్(ఉప ప్రధాని)గా, వజీర్(ప్రధాని)గా ఫిరోజ్ షా తుగ్లక్ కొలువులో బాధ్యతలు చేపట్టి కీర్తి ప్రతిష్టలు సంపాదించాడు. యుగంధరుడు ఒక రాక్షసుడు,ఒక చాణక్యుడు మనస్మృతి పథంలో నిలుస్తారు. నిజానికి రాజ్యం రాజు భుజస్కంధాల మీద నిలువదు. సచివుల మంత్రాలోచన మీదనే ఆధారపడి ఉంటుంది.ప్రభువుమీద,రాజ్యం మీద, ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకోనే బాధ్యత సచివులదే. యుగంధరుడు ప్రతాపరుద్రుని మహామంత్రిగా ప్రసిద్ధి చెందాడు.ఆయన పేరుతో వెలుగులోకి వచ్చిన ఈ కావ్యం వీరరస ప్రధానమైనది. ఏ దేశానికైనా, ఏ జాతికైనా పౌరుషం కలిగిన చరిత్రే ప్రాణం లాంటిది.చరిత్ర అనేది శౌర్యమనే రాక్షాక్షరాలతో రాయబడినప్పుడే అది భవిష్యత్ తరాలకు స్ఫూర్తిని, కీర్తిని ప్రసాదించగలుగుతుంది.యుగంధరుని కారణంగా కాకతీయుల చరిత్రను ప్రకాశవంతంగా చూపిస్తుంది. "తేరిపార జూడరరులు తెగువజేసి/సర్వ కళలకు కాణాచి సాధికారి/స్వామి భక్తుడు తాపసి సర్వమతడె/అతడు లేకున్న నంతయునంధతమమె" మంత్రి యుగంధరుల తీర్థయాత్రలు రామాచార్యకు గల క్షేత్ర పరిజ్ఞానంతో పాటు వారి దేశాభిమానాన్ని తేటపరుస్తాయి. యుగధరులచేత 'రామసేతువు'ను సందర్శింప చేయడం ఈ కావ్యంలో కొస మెరుపుగా మలిచారు. "శక్తిర్నిపుణతా లోకశాస్త్ర కావ్యాద్యవేక్షణాత్" అని మమ్మటుని మాటలు పొల్లు పోలేదు.కావ్య నిర్మాణానికి ప్రతిభతో పాటుగా వ్యుత్పత్తి ఉండాలనేది.

### యుగంధరుడి లోకోత్తరం-డింగరి వర్ణన నైపుణ్యం

ఈ కావ్యంలో కవి తన పని అనుభావాలను ప్రదర్శించడమే కాదు, చెప్పేది లోకోత్తరంగా ఉండడమే. రామాచార్య మహామంత్రి యుగంధరలో లోకానుభవాన్ని వ్యక్తం చేయడమే కాకుండా,లోకోత్తరంగా చెప్పాడు. ఆయన జాతి చరిత్ర పుటల్లోకి వెళ్ళితే అక్కడే ఉండక, ముందు తరాలకు అవసరమయ్యే చైతన్యాన్ని అందించాడు. ప్రతాపరుద్ర చక్రవర్తి గురించి ఒక చోట ఇలా అంటాడు. "ప్రజల బాగోగులనీ జూచి పార్థివునీడు/ప్రజల బంధు, దయ సింధు, భాగ్యశాలి...." రాజైనప్పుడు తన బాగోగులే కాకుండా ప్రజల బాధ్యతలు చూసేవాడు దొరకాలి. ప్రజలకు బంధువుగా ఉండాలి. దయ చూపించాలి. అదే సమయంలో ఇతరుల మీద ఆధారపడి ఉండకుండా వీరుడై ఉండాలి. శత్రువును మట్టి కరిపించేవాడై ఉండాలి.రాజు యొక్క గొప్పతనాన్ని గురించి చెప్పడమే కాకుండా ఈ పద్యంలో ఎన్నోరకాల విషయాలు చెప్పబడినయి. అవే కళలు, కార్యదక్షతలు, పరిపాలకులు మారిన ఈ వీక్షణాలు మాత్రం ఎప్పుడు ఒకే విధంగా ఉంటాయి.రామాచార్య వర్ణన నిపుణుడు. కావ్యమంటేనే వర్ణనలు.కావ్యంలో ఓరుగల్లు వర్ణన,సూర్యోదయ వర్ణన,పరోక్షంగా ఇది వీరరస కావ్యంగా తెలియపరుస్తుంది.అష్టాదశ వర్ణలలో ఉండవలసిన లక్షణాలు అన్నీ ఇందులో ఉన్నాయి. ఈ కావ్యంలో ప్రతాపరుద్రుడు ఒక పాత్రగానే కనిపిస్తాడు కానీ నాయకుడిగా కాదు.యుగంధరుడే నాయకుడు. "తప్పెట తాళముల్ చెవులు దద్దరిలంగ భేరిభానీకృతుల్...." అంటూనే చారిత్రాత్మకమైన ఇతివృత్తాన్ని ఉన్నది ఉన్నట్టుగానే ఉంచి రామాచార్య చిన్న చిన్న కల్పనలు చేసి వర్ణనాత్మకంగా కావ్య రచన చేశాడు. ప్రతాపరుద్రుని ఆత్మత్యాగం కంటతడి పెట్టించే అపూర్వఘట్టం. ఢిల్లీ సుల్తానులచేత బంధించబడిన ప్రతారుద్రుడు తిరిగి సింహాసనం అధిష్టించలేకపోయాడు. దానితో యుగంధరుని ప్రయత్నమంతా వృథ అయినదానుకుంటాము. కానీ యుగంధరుడు అపారమైన చతురత, చాణిక్యం కలిగినవాడు. అందుకే మాలిక్ మక్బుల్ బిరుదుతో నాగయగన్న మంత్రిగా విలసిల్లినాడు.

### కాకతీయుల రాజ్య బిందువు 'హైందవ ధర్మరక్షణ'

తెలుగురాజుల చరిత్రలో కాకతీయ రాజ్యం అధఃపాతాలనికి పీఠంగా మారింది అంతఃకలహాల వల్ల, ముస్లింల దాడుల వలన అంతమైనప్పటికి అది చరిత్రలో చూపిన పౌరుషం చాలా గొప్పది.సాహిత్య శిల్ప కళా రంగాలలోనూ, ప్రజారనీజకమైన పాలన విషాయాలలోను కాకతీయులది ఒక ప్రత్యేకమైన ఒరవడిగా చెప్పవచ్చు. "హైందవ ధర్మ రక్షణకు విజయనగర ప్రభువులకు దారులు వేసినది కాకతీయులే మార్గదర్శులని" డంగరి రామాచార్య ఈ పద్యకావ్యంలో వెలిబుచ్చారు. "తెలుగు పౌరుష తేజముల్ దీప్తమౌత!/ధీర తెలంగాణ తేజముల్ దీప్తమౌత" అన్న పద్యంలో బ్రాహ్మ్యంతో పాటు క్షాత్రాన్ని అవలంభించి మనల్ని మనం సంరక్షించుకోవాల్సిన అవసరాన్ని ఈ పంక్తులు గుర్తు చేస్తున్నాయి. తెలంగాణాలో పౌరుషాగ్నిని రగిలిస్తున్నాయి. అందుకే ఈ పద్యకావ్యం రాణా ప్రతాప్ సింహ్ చరిత్ర,శివభారతం రచనల సరసన చేరకలిగిన ఉత్తమోత్తమ గ్రంథమిది. తెలంగాణ సాహితీ క్షేత్రంలో ఈ మధ్యకాలంలో ఇదొక మైలురాయిలాంటిది.పూర్వవైభవాన్ని చాటిచెప్పే మహత్తరమైన చారిత్రాత్మక కావ్యం. కావ్యం రసాత్మకమైనప్పుడు దాని ప్రయోజనం కూడా ఆనందమే.ఉత్తమపురుషుని చరిత్ర నిబద్ధమైనప్పుడు ఉపదేశం పరమ ప్రయోజనం చేకూరుతుంది. మహామంత్రి యుగంధర రసవత్తరమైన కావ్యమే కాదు, ఉత్తమమైన పౌరుష పురుష నిబద్ధమైన కావ్యం అనడానికి నిదర్శంగా సాహిత్య లోకంలో పాఠకుని మనస్సులో చొచ్చుకు పోయింది. తెలంగాణ తేజం ఉట్టిపడేలా ఒక తెలుగు పద్యకావ్యాన్ని డా.డింగరి రామాచార్య "మహామంత్రి యుగంధర" చారిత్రక కావ్యాన్ని అందించడం,ఆయన జన్మ సార్థకం చేసుకున్నాడు అనడంలో సంశయమే లేదు.



-డా.ఓర్సు రాయలింగు
9849446027

## ముఖద్వారం

గుడికైనా బడికైనా
ఇంటికైనా వంటికైనా
చిరునామా ముఖద్వారమే
అందానికి ఆనవాలు
సంస్కృతికి దర్పణం
లేవితో వెలుగొందే
పెద్ద దర్వాజ!!.

పసుపు కుంకుమ
తెల్లని బొట్లతో సింగారించుకుని
మామిడి తోరణాలతో కళకళలాడుతూ
పూల దండలతో ముస్తాబై
అందంగా అగుపించే గృహ ముఖలక్ష్మి!!

సూర్య కిరణాలు
భువికి చేరుకోక ముందే గడప పూజ
అందరికీ స్వాగతం పలికే
పెద్దముత్తైదువ గలుమ!!

హిరణ్య కశిపునికి శిక్ష పడింది
కడప మీదే మరి
నేడు మాయదారి రోగానికి
అడ్డుగా ఉండి రక్షించేది
రేఖ దాటితే శిక్షించేది
ఇంటిముందు
కొలువుదీరిన కడప తల్లి!!

ఆడపిల్లకు ప్రాతినిధ్యం
లక్ష్మీ దేవికి ప్రతిరూపం
రాజసం ఉట్టిపడే గలుమ
అనుబంధాల చెలిమ
ఆనందాల కలిమి
రక్షణకు బలిమి!!



-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి
9490367383

## పేదవారి ఆకలి మంటల రోదనలు వినిపించవా ?

ఇటీవలే భారత్ ప్రపంచంలో అయిదవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. అయితే ఆహార భద్రతా పరంగా మనకు ఎన్నో సవాళ్ళు ఎదురవుతున్నాయి.ఐక్య రాజ్య సమితి సెప్టెంబరులో విడుదల చేసిన ప్రపంచ ఆహార భద్రతా సూచీలో 113 దేశాల పట్టికలో 71 వ స్థానంలో, ప్రపంచ ఆకలి సూచీలో 101 వ స్థానం లో నిలిచి బోలెడంత అప్రతిష్ట ముటకట్టుకుంది. ఆహార భద్రతపై మన ప్రభుత్వాలు అవలంబిస్తున్న నిర్లక్ష్య, నిర్లిప్త పూరిత వైఖరికి ఈ రాంకులే నిదర్శనంగా భావించవచ్చు. సాంకేతికపరంగా ఎంతో అభివృద్ధి సాధిస్తున్న మన దే,శంలో ఇంకా ప్రజలందరికీ సరిపడినన్ని ఆహార ధాన్యాలు లభించడం లేదు, పైగా ఇంకా ఎన్నో ప్రాంతాలలో ఆకలి చావులు సంభవిస్తుండడం దురదృష్టకరం. ఆహారం కొనుగోలు సామర్థ్యం విషయంలో పొరుగు దేశాలైన పాకిస్థాన్, శ్రీలంక కంటే భారత్ వెనుకబడింది. మొత్తంగా ఆహార భద్రతలో ఐర్లాండ్, ఆస్ట్రేలియా, బ్రిటన్, ఫిన్లాండ్, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్, అమెరికా అగ్రస్థానంలో ఉన్నాయి. గడిచిన దశాబ్దకాలంలో ఆహార భద్రతలో భారత్ పెద్దగా పురోగతి సాధించలేదని నివేదిక వెల్లడించింది. ఈ విషయంలో పాకిస్థాన్, నేపాల్, బంగ్లాదేశ్, చైనా.. భారత్ కంటే ఎంతో ముందున్నట్టు వివరించింది.

ఇక దేశీయంగా ఆహార భద్రత ప్రమాణాల్లో ఏపీ కి 17వ స్థానం, తెలంగాణాకు 15 వ స్థానం లభించింది.

ఆహార భద్రతా ప్రమాణాలను పాటించడం, హైజీన్ రేటింగ్‌లో తెలుగు రాష్ట్రాల హోటళ్లు, వ్యాపార సంస్థలు వెనుకబడ్డాయి. రాష్ట్రాల వారీగా ఆహార భద్రత్రశాఖల పనితీరును 2021-22 ఆర్థిక సంవత్సరానికి పరిశీలించినప్పుడు తెలంగాణ 15, ఏపీ 17వ స్థానానికి పరిమితమయ్యాయి.

డబ్ల్యూహెచ్ఓ 2019 రిపోర్ట్ ప్రకారం... ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా కలుషిత ఆహారం కారణంగా 600 మిలియన్ల ప్రజలు అనారోగ్యం బారినపడుతున్నారు. అంటే... ప్రపంచంలో ప్రతీ 10 మందిలో ఒకరు కలుషిత ఆహార బాధితులుగా మారుతున్నారు. పిల్లల్లో ఇది మరింత ఎక్కువగా ఉంది. ఏటా ఐదేళ్ల లోపు పిల్లలైన 1,25,000 మంది కలుషిత ఆహారం కారణంగా మరణిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవాన్ని నిర్వహించాలని డిసెంబర్, 2018లో ఐరాస జనరల్ అసెంబ్లీ నిర్ణయించింది. జూన్ 7, 2019 నుంచి దీన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం రోజున డబ్ల్యూహెచ్ఓ అధికారిక వెబ్‌సైట్ వేదికగా ఆహార భద్రతపై పలు చర్చా కార్యక్రమాలు నిర్వహిస్తారు. సురక్షిత, శుభ్రమైన ఆహారాన్ని తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, కలుషిత ఆహారం ద్వారా కలిగే అనారోగ్యం తదితర అంశాలపై ఇందులో చర్చిస్తారు. అయితే ఈ కార్యక్రమాలన్నీ తు తు మంత్రం చందాన సాగుతునట్లు తాజా ఐ రా స నివేదిక ప్రకారం తెలుస్తోంది.

> రెండు దశాబ్దాలుగా ఆర్థికాభివృద్ధి అధికంగా ఉన్నప్పటికీ ఆకలి చావులు ఎందుకు ఉన్నాయన్న విషయంలో కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆత్మ పరిశీలన చేసుకోవాలి.

దేశ రాజధాని ఢిల్లీలో గత జులైలో ముగ్గురు బాలికలు ఆకలికి అలమటించి మరణించిన ఉదంతం అనేక ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఈ ఉదంతం స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 70 ఏళ్లకు కూడా రాజ్య వ్యవస్థ పౌరులను కాపాడలేకపోతోందన్న ప్రశ్ననే కాక మనం ఎంచుకున్న అభివృద్ధి మార్గాన్ని కూడా ప్రశ్నార్థకం చేస్తోంది. ఎనిమిదేళ్ల మన్సి, నాలుగేళ్ల శిఖ, రెండేళ్ల పరుల్ ను జులై 24 న ఆసుపత్రికి తీసుకెళ్లారు. కాని అప్పటికే ఆ ముగ్గురూ మరణించినట్టు డాక్టర్లు తేల్చారు. శవ పరీక్షలో ఆ పసి కందు లవి ఆకలి చావులు అని నిర్ధారణ అయింది. ఈ సంఘటన పట్ల సుప్రీం కోర్టు తీవ్రంగా స్పందిస్తూ ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా పరిష్టమైన చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే ఈ ఆదేశాలు ఇప్పటివరకు అమలు కాకపోగా కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఆహార భద్రతా చట్టం పరిష్టమైన అమలుకు ఒక రూట్ మ్యాప్ విడుదల చేయకపోవడం నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం.

రాజ్య వ్యవస్థ అందజేసే సదుపా యాలను అందజేయడంతో పాటు రెండు దశాబ్దాలుగా ఆర్థికాభివృద్ధి అధికంగా ఉన్నప్పటికీ ఆకలి చావులు ఎందుకు ఉన్నాయన్న విషయంలో కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ప్రస్తుతం అనుసరిస్తున్న ఆర్థిక వ్యవస్థలో కొద్ది మందికి మాత్రమే ప్రయోజనం కలుగుతుందన్నది నిర్వివాదాంశం. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ వారి 2021 వార్షిక నివేదిక ప్రకారం దేశంలో 90 శాతం సంపద కేవలం 2 శాతం బిలియనర్ల వద్ద కేంద్రీకృతమై వుంది. దేశంలో దాదాపుగా 70 శాతం చాలా మందికి జీవనోపాధికి, గౌరవప్రద జీవనానికి అవకాశమే ఉండడం లేదు. ఉపాధి అవకాశాలు కొరవడుతున్నాయి. ఈ వాస్తవాలను అంగీకరించాలి. జీవనోపాధికి భద్రత కొరవడినందువల్ల లక్షలాది మంది దుర్భర జీవితం గడపాల్సి వస్తోంది. వారి జీవనో పాధికి భద్రత లేదు.

ఒక పక్క విజ్ఞానం, టెక్నాలజీలు ఎంతో పెరిగాయి. శాస్త్రవేత్తలు ఎన్నో విషయాలను కనుగొంటున్నారు. మరో పక్క ఏటా లక్షలాది మంది ప్రజలు ఆకలితో చనిపోతున్నారు. ఇలాంటి చావులకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వాలు చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలి. ప్రపంచ దేశాలు ఒక్క తాటిపై కొచ్చి సమస్యకు పరిష్కారం కనుగొనకపోతే భవిష్యత్తులో తీవ్రపరిణామాలు తప్పవని సామా జిక విశ్లేషకులు అంటున్నారు.

ప్రతి ఒక్కరికి పని కల్పన, పేదలకు అందేలా సంక్షేమ పథకాలు రూపొందించేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

ఇప్పటికైనా దేశాలు ఆయా ప్రభుత్వాలు ఆకలి చావులను నియంత్రించేందుకు నిజాయితీగా ప్రయత్నించాలి. అందుకు ప్రతి ఒక్కరికి పని కల్పించాలి, పేదరికాన్ని నిర్మూలించేందుకు అడుగులు పడాలి. దీంతో పాటు పేదలకు అందేలా సంక్షేమ పథకాలను అమలు చేయాలి. ఆ పథకాలు కచ్చితంగా పేదలకు అందేలా చూసుకోవాలి. అప్పుడు మాత్రమే ఆకలి చావులకు అడ్డుకట్టపడుతుందని సామాజిక విశ్లేషకులు అంటున్నారు. తేలికగా ఆహారాన్ని పండించడం, పండించిన ఆహారం అందరికీ చవకగా లభించడం, అలా లభించిన ఆహారంలో తగినన్ని పోషకాలు ఉండటంపై దృష్టి సారించాలి.

-సి హెచ్ ప్రతాప్
95508 51075

## స్నేహం

తోడు నీడలా వున్న
చెప్పుకోలేని మాటలు కొన్ని !

కోకొల్లపు బంధాల వాకిట్లో
ముగ్గులు వేసిన చుక్కలు కొన్ని!

ఆపదలో అన్నీవున్న
శూన్యంలో ఏదో వెతుక్కుంటున్న
వైనాలు కొన్ని!

మమతానురాగల పందింట్లో
రక్తసంబంధ నీడల
ఓదార్పులు కొన్ని

అన్ని వున్న కొన్ని చెప్పుకునే
మంచి మనుసున్న వైనాలు కొన్ని!

నాదంటు చెప్పుకునే ఓ స్నేహం
గాయమైన మాటలకు
ఓదార్పు లేపనం స్నేహం.

ఒకరినొకరు విశ్వాస గుడిలో
నమ్మకపు మొక్కులతోపంచుకొనే
చిరస్థాయి నేస్తం స్నేహం



-డాక్టర్ పగిడిపల్లి సురేందరు

